Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 03.10.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 18 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# జయహో 'నమో'

## అగ్రరాజ్యాన అపూర్వ ఆదరణ



అమెరికా... ప్రపంచాన్ని శాసిస్తున్న అగ్రరాజ్యం. ప్రతి దేశాధినేత తన పరిపాలనాకాలంలో ఒక్కసారైనా పర్యటించాలనుకునే దేశం. 2002ప్రాంతంలో ఆ దేశం గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న నరేంద్ర మోడీకి వీసా నిరాకరించింది. మా దేశానికి రావద్దంటూ రెడ్‌సిగ్నల్ ఇచ్చింది. కాని ఇప్పుడు అదే దేశం, అదే నరేంద్ర మోడీకి రెడ్ కార్పెట్ పరచి స్వాగతం పలికింది.

(మిగతా 10వ పేజీలో)

# కొంపముంచిన నేరచరిత

## జైలుకెళ్ళిన వీరవనిత



అమ్మ వాటర్, అమ్మ సాంబార్, అమ్మ ఇడ్లీ, అమ్మ దోశె, అమ్మ సిమెంట్, అమ్మ స్టీలు... తమిళనాడులో సంక్షేమ పథకాల పరంపర ఇది. వీటికి అద నంగా ఇప్పుడు ఆ రాష్ట్రంలోని జైళ్ళకు కూడా అమ్మజైలు, నిందితులకు అమ్మ ఖైదీలు అని పేర్లు పెట్టొచ్చేమో!

కొన్ని కేసుల్లో విచారణలు ఏళ్ల తరబడి సాగుతుంటాయని, ఈ సుదీర్ఘ కాలంలో దొంగలు దొరలవుతుంటారని, కేసుల నుండి తప్పించుకుంటుంటారనే విమర్శలు ఉన్నాయి. ఆ విమర్శలను పటాపంచలు చేస్తూ బెంగుళూరు కోర్టు ఓ సంచలన తీర్పు వెలువరించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు నాలుగేళ్ల జైలు శిక్ష, వందకోట్ల రూపా యల జరిమానా విధిస్తూ బెంగుళూరు ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి జాన్‌మైఖేల్ డి కున్హా తీర్పు చెప్పారు. అంతేకాకుండా ఆమెను ఆరేళ్లపాటు రాజ్యాంగబద్ధ పదవులకు అనర్హురాలిగా ప్రకటించారు. ఈ కేసులో ఆమెతో పాటు సహనింది తులు శశికళ, సుధాకరన్, ఇళవరసి లకు నాలుగేళ్ల జైలుశిక్ష, తలా పదికోట్ల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పుచెప్పారు. తీర్పు వెలువడిన వెంటనే ఈ నలుగురినీ బెంగుళూరు సెంట్రల్ జైలుకు తరలించారు. జయ లలితకు బెయిల్ కోసం ఆమె తరఫు న్యాయవాదులు కర్నాటక హైకోర్టులో బెయిల్‌పిటిషన్ దాఖలు చేయగా, దీనిపై విచారణను కర్ణాటక హైకోర్టు 6వ తేదీకి వాయిదా వేసింది.

కాగా జయకు జైలు శిక్ష ఖాయమనే ప్రచారం గత కొన్నిరోజులుగా ఉంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు అంతటా ముందుగానే భద్రతాదళాలను దిం చారు. జయకు కూడా భవిష్యత్ అర్థమై ముందుగానే జాగ్రత్తలు తీసుకుంది. తన స్థానంలో సీఎం పదవికి నమ్మినబంటు పన్నీరుసెల్వంను ఎంపిక చేసింది. 2001లో జయకు జైలుశిక్ష పడ్డప్పుడు

(మిగతా 10వ పేజీలో)

# 'ఎవర్‌గ్రీన్ హీరో' సుబ్బరామిరెడ్డి



6,7లో



## శుభాకాంక్షలు

పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
చందాదారులకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
**విజయదశమి శుభాకాంక్షలు.**

- సం/-




# వేటు పడింది!

## 'గోపి'లకు అనర్హత శిక్ష

జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించి తెలుగుదేశంపార్టీకి మద్దతు పలికిన 8మంది జడ్పీటీసీలపై అనర్హత వేటు పడింది. వీరిపై చర్య తీసుకునేందుకు హైకోర్టు గత నెల 28వ తేదీ వరకు గడువిచ్చింది. ఈలోపు అనర్హత వేటు పడకుండా స్టే తెచ్చుకునేందుకు జడ్పీటీసీలు అధి కారపార్టీ ద్వారా ప్రయత్నించారు. అయితే ఆ ప్రయత్నాలు నెరవేరక పోవడంతో, గడువు కూడా ముగియ డంతో వారిపై అనర్హత వేటు వేస్తూ జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ నిర్ణయిం తీసుకున్నారు.

అనర్హత వేటుకు గురైన వారిలో సీతారాంపురం జడ్పీటీసీ కలివెల జ్యోతి, వింజమూరు జడ్పీటీసీ పులిచర్ల నారాయణరెడ్డి, కావలి జడ్పీటీసీ పెంచ లమ్మ, చేజర్ల జడ్పీటీసీ షేక్ సల్మా షరీన్, మనుబోలు జడ్పీటీసీ టి.రమేష్, కోట జడ్పీటీసీ

(మిగతా 10వ పేజీలో)



## పిఏసిలో కాకాణి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ కమిటీకి ఛైర్మెన్‌గా భూమా నాగిరెడ్డిని నియమించారు. ఆమేరకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లెజిస్లేటర్ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.

## మంత్రి కార్యాలయం మూత

నెల్లూరు నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న మంత్రి నారాయణ వ్యక్తిగత కార్యాలయాన్ని మూతేసారు. ఇక నుండి మంత్రిగా నారాయణ జిల్లాకు వచ్చినప్పుడు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుండే తన కార్యకలాపాలు నిర్వహిస్తారు.

## మేను తలపిస్తున్న ఎండలు

జిల్లాలో ఎండలు మే నెలలో కాస్తున్నట్లే కాస్తున్నాయి. ఈ నెల అక్టోబర్ నెల మాదిరిగా లేదు, రోహిణికార్తె లాగుంది. ఉదయం 6గంటలకే సూర్యుడు భగభగమంటూ మండుతూ వస్తున్నాడు. ఎండలకు జనం చెమటల్లు కక్కుతున్నారు. రాత్రివేళల్లో ప్రతి ఇంటిలోనూ ఏసిలు రన్నింగ్‌లోనే వుంటున్నాయి. నెల తిరిగేసరికి వచ్చే కరెంటుబిల్లులతో వినియోగదారుల గూబ గుయ్‌మంటోంది. నవంబర్ నెల వచ్చినా ఎండలు తగ్గుముఖం పట్టకపోవడంతో జనం అల్లాడుతున్నారు.

• దసరా ధమాకా

## బస్సులు, రైళ్లు కిటకిట

విజయదశమి సెలవుల దెబ్బకు బస్సులు, రైళ్లలో ప్రయాణీకుల రద్దీ ఎక్కువైంది. ముఖ్యంగా దసరా సెలవులను దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ స్పెషల్ రైళ్లను ఏర్పాటుచేసినా ప్రయాణీకుల రద్దీకి సరిపోలేదు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుండి నెల్లూరొచ్చే వాళ్లు బస్సులపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఈ నగరాల నుండి ఆర్టీసీ అదనపు బస్సులను కూడా నడిపింది. ఇక ప్రైవేట్ ట్రావెల్స్ టిక్కెట్లు అయితే ఎప్పుడో అయిపోయాయి. కొందరైతే ముందుగానే టిక్కెట్లను బుక్‌చేసుకుని వాటిని బ్లాక్‌లో అమ్ముకున్నారు.

సింహపురి సమాచారం

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**- జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి**



అధికారులు సమన్వయంతో పనిచేసి సకాలంలో పాఠశాల భవనాల నిర్మాణపు పనులు పూర్తి చేయాలని, ఇప్పటివరకు ఎన్ని పాఠశాలల భవనాల నిర్మాణాలు పూర్తిచేశారో వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధికారులను ఆదేశించారు. గత నెల 26న తన కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ అధికారులు, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ జితేంద్ర, డిఇఓ ఉష, సర్వశిక్ష అభియాన్ పి.డి కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

**నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్**



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు ఉపాధ్యాయుల పాత్రే కీలకమని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గత నెల 26న నగరంలోని రాజన్నభవన్‌లో ఏపి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సబ్‌కమిటీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి. మోహన్, శివకుమార్, బెనర్జీ, నారాయణరాజు, వాసు, యానాదిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## 3న వైకాపా కార్యాలయం ప్రారంభం

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఈ నెల 3న విజయదశమి రోజు ప్రారంభించనున్నారు. మాగుంట లే అవుట్‌లో వెంకటేశ్వరస్వామి గుడి వెనుక కొత్త కార్యాలయాన్ని ముస్తాబు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులైన వారు ఒక్కొక్కరు ఒక్కోచోట జిల్లా కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పొదలకూరురోడ్డులో కలెక్టర్ బంగ్లా సమీపంలో పార్టీ కార్యాలయం ఉండేది, మేరిగ మురళి అధ్యక్షుడయ్యాక మాగుంట లేఅవుట్‌లో ఎస్ఆర్‌కె స్కూల్ పక్కనున్న భవనంలోకి మార్చారు. ఇప్పుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధ్యక్షుడయ్యాక పార్టీ కార్యాలయానికి మూడో అడ్రస్ వచ్చింది.

## పించన్ల కమిటీలో ప్రాధాన్యత ఏదీ?

-------- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి --------

పించన్ల కమిటీలో భారతీయ జనతాపార్టీకి తగిన ప్రాధాన్యత కల్పించలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీతో కలిసి పోటీ చేసిన టిడిపి, గెలిచిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని పించన్ల కమిటీలో బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు సభ్యత్వం ఇవ్వాలని కోరామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బందారు శ్రీనివాసులు, దువ్వూరు పరశురాం, నరశింహులునాయుడు, కాయల మధు, పలుకూరు జనార్ధన్‌రావు పాల్గొన్నారు.


## కోటంరెడ్డి జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మందా బాబ్జీ, వైయస్సార్సీపీ కార్యకర్తలు

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సెప్టెంబర్ 26వ తేదీ నిర్వహించారు. తన కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల మధ్య శ్రీధర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీ స్టీరింగ్ కమిటీ సభ్యులు మందాబాబ్జీ పలువురు కార్యకర్తలు జూబ్లీ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివరంజన్‌రెడ్డి, వైయస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనబడుట లేదు



పేరు : నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
వయస్సు : 54 సంవత్సరాలు
వృత్తి : రాజకీయం
ప్రస్థానం : 1989, 1999, 2004, 2009 సంవత్సరాలలో యం.యల్.ఏగా గెలిచాడు. 2004 నుండి 2009 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పని చేశాడు. 2009లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా నియమింపబడి అనంతరం 2010 నవంబర్ 10న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, 2014 మార్చి 1న ఆ పదవికి రాజీ నామా చేసి 2014 మార్చి10న 'జై సమై క్యాంధ్ర' పార్టీని స్థాపించి 2014 ఎన్నికల అనంతరం కనపడకుండాపోయాడు.

గుర్తులు : చామనచాయ రంగులో వుంటాడు, కొంచెం పొట్టిగా, కొంచెం పొడవుగా వుంటాడు. మాటకు ముందూ వెనుకా "గుడక" అంటుంటాడు. తెలుగు సరిగా రాదు. బెంగుళూరులో వున్నట్లు సూచాయగా తెలుస్తోంది. ఎవరికైనా కనిపిస్తే యోగ క్షేమాలు కనుక్కోవలెను. ఎట్టిపరిస్థితుల్లోను ఆంధ్రాకు మాత్రం వెళ్ళవద్దని సలహా ఇవ్వవలెను.

ఇట్లు
అమాయక ఆంధ్రులు

చంద్రబాబుతో "ఢీ"కొనగల సత్తా, వై.యస్.కుటుంబానికి ఆంతరంగికుడిగా "జగన్"ను అడ్డుకోగల తెలివి, ఇంగ్లీషు బాగా మాట్లాడగలడు కాబట్టి కేంద్రంలో అధిష్టానంతో అందరికీ అర్థమయ్యే భాషలో విషయాలు విపులీకరించగల ప్రావీణ్యం అన్నింటినీ మించి అప్పటివరకు ఒక్కసారి కూడా మంత్రిపదవి పొందలేదుకాబట్టి అవినీతిపరుడు కాదన్న ముద్ర... ఇవన్నీ అదృష్టంలా కలిసొచ్చి 2010, నవంబర్ 10న ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రానికి 16వ ముఖ్యమంత్రిగా నియమింపబడ్డ వ్యక్తి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి.

కాంగ్రెస్ అధిష్టానం తనకప్పజెప్పిన రాష్ట్ర విభజన కార్యక్రమాన్ని "దిగ్విజయంగా" పూర్తిచేసి, తాను, తన సోదరులు, తన అనుచరులు భవిష్యత్ తరాలకు కావలసినంత సంపాదించుకున్న అనంతరం మార్చి 1, 2014న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేసి 2014 మార్చి 10న 'జైసమైక్యాంధ్ర' పార్టీని స్థాపించి చెప్పుల గుర్తు ద్వారా తన పార్టీని, పార్టీ అభ్యర్థులను 2014 ఎన్నికల్లో దించి తాను మాత్రం చెప్పుదెబ్బలు తినకుండా ఎన్నికల ఫలితాల అనంతరం కనుమరుగైపోయాడు. ఇప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆచూకీ కోసం అమాయక ఆంధ్రాజనం వెదుకుతున్నారు. బెంగుళూరులో వున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఆయన హయాంలో జరిగిన అవినీతిని కూడా ఎవరైనా బయటకు తీస్తే సిబిఐ వెళ్ళి ఈయన ఆచూకీ ప్రజలకు తెలియజేస్తుంది. అటునుండి అటే జయలలిత వద్దకు తీసుకెళ్తుందేమో?

## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో
# రాజగోపుర మహాకుంభాభిషేక మహోత్సవాలు



సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్మించిన గాలిగోపురానికి అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా, త్రయాహ్నిక దీక్షతో మహా కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 2వ తేదీ ఉదయం అమ్మవారికి అత్యంత వేడుకగా గ్రామోత్సవం నిర్వహిస్తారు. 3వతేదీ ఉదయం 6.45 నుంచి 7.05లోగా బింబో స్థాపన, యంత్ర, శిఖర, విగ్రహ ప్రతిష్టలు, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం10.18 నుంచి 10.28లోగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని, అనంతరం మహామంగళ హారతి, ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. రాజగోపుర కుంభాభిషేక కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీన రాష్ట్ర మునిసిపల్ మంత్రి డాక్టర్ పి.నారాయణ ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, నగర మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాధ్, 38వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి కొమరగిరి శైలజ తదితరులతో పాటు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పురావస్తుప్రదర్శనముల శాఖ సంచాలకులు జివి రామకృష్ణా రావు, ఎస్. బంగారయ్య, దేవాదాయశాఖ కమిషనర్ వి. త్రినాధరావు, సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తదితరులు ప్రత్యేక అతిధులుగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాలకు విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షానికి పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అటవీశాఖ - పోలీసుశాఖ డిష్యుండిష్యుం
## డిఎఫ్ఓ రాంబాబు బదిలీ

అనంతసాగరం మండలంలో ఇటీవల పోలీసులకు, అటవీ సిబ్బందికి మధ్య జరిగిన గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పోలీసుల పాత్ర ఉందంటూ డిఎఫ్ఓ రాంబాబు చేసిన వ్యాఖ్యలు పోలీసు శాఖలో ఆగ్రహావేశాలు రగిల్చాయి.స్వయంగా ఎస్పీ సెంథిల్‌కుమారే రంగంలోకి దిగారు. అటవీశాఖతో న్యాయ బద్ద పోరాటానికి సిద్ధమయ్యారు. ఈమేరకు పోలీసులపై ఆరోపణ చేసిన డిఎఫ్ఓకు లీగల్ నోటీసులు జారీచేసినట్లు సమాచారం. కాగా జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రాంబాబును బదిలీచేస్తూ రాష్ట్ర అటవీశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



ఆహ్వానము
నెల్లూరు మాగుంట లే అవుట్,
3వ మెయిన్‌రోడ్డులోని రోడ్ నెం.3లో
నూతనంగా ప్రారంభించనున్న
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా
వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ
నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి
అందరికీ ఇదే మా
ఆహ్వానము.
ముహూర్తం:
తే. 3.10.2014ది, శుక్రవారం
ఉదయం 11.45 నుండి 12.00లోగా
ఇట్లు:
జిల్లా కమిటి
వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ

# 'ప్రభా'తం

## అక్రమార్కులకు చెంపపెట్టు



*ప్రజాజీవనంలోకి వచ్చిన నాయకులు, ప్రజలను పాలించే నేతలు ఎంతో పవిత్రంగా, అవినీతిరహితంగా.. బాధ్యతాయుతంగా వుంటూ తమ విధులను నిర్వర్తించాలన్నదే ఇక్కడ సారాంశం. ధనదాహంతో అడ్డగోలు సంపాదనలకు పాల్పడితే, ఎవరెంతటి పదవుల్లో వున్నా.. పరిస్థితి ఇలాగే వుంటుందని బెంగుళూరు కోర్టు తీర్పు స్పష్టం చేసింది.*

ప్రపంచంలోనే మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అందులోనూ రాజకీయ వ్యవస్థ, అధికార వ్యవస్థ, న్యాయవ్యవస్థ, పత్రికా వ్యవస్థ అనే నాలుగు వ్యవస్థలూ భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలు. దేశాభ్యున్నతికి, దేశ సౌభాగ్యానికీ ఈ నాలుగు రంగాలే ఎంతో కీలకం. ఈ వ్యవస్థలు ఎంత పటిష్టంగా వుంటే, దేశం అంతగా పురోగమిస్తుంది. ఈ వ్యవస్థలు సమన్వయంతో ముందుకు సాగితే, దేశంలో ఎంతటి దురన్యాయాలూ.. దురాచారాలనైనా, ఎంతటి అవినీతులు.. దుర్నీతులనైనా అరికట్టవచ్చు. ప్రజలకు మరింత మేలైన పాలనను అందివ్వవచ్చు. అయితే, రానురాను ఈ నాలుగు రంగాల్లో సమన్వయలోపం వల్లనో, లేదా అందరికన్నా తామే గొప్ప అనే అభిజాత్యం వల్లనో, ఆధిపత్య ధోరణుల వల్లనో..లేదా ఎవరికి వారు గిరి గీసుకుని తమ పరిధుల్లోనే వుండిపోవడం వల్లనో.. కారణాలేమైతేనేం సర్వత్రా స్వార్ధమే నిండిపోతోంది. దేశంలో ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు పెరిగిపోతూనే వున్నాయి. స్వార్థపూరితమైన... లోపభూయిష్టమైన విధానాలే మన దేశ సమున్నతమైన, ప్రగతికీ.. సకల సౌభాగ్య దాయకమైన లక్ష్యాల సాధనకు ప్రతిబంధకాలవుతున్నాయి.

ఎన్నెన్ని చట్టాలు చేసినా, ఎంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా అవినీతి మాత్రం తానే సర్వాంతర్యామి అన్నట్లుగా వికటాట్టహాసం చేస్తూ తన విశ్వరూపం చూపుతూనే వుంది. ఎందెందు వెదకి జూసిన అందందే కలదు.. అన్నట్లుగా ఒకచోట పట్టుకుంటే, మరోచోట పుట్టుకుంటూ జడల దెయ్యంలా అవినీతి విస్తరిస్తూనే వుంది. ఇలాంటి అవినీతి నరకాసురవధకు, ప్రతి ఒక్కరూ బాణాలు ఎక్కుపెట్టాలి. మాయల మహమ్మారిగా మారి ప్రజల ఆశలను, ఆకాంక్షలను, అభివృద్ధినీ నంజుకుతింటూ కోట్లాదిమందిని ఇంకా కటికపేదలుగా.. నిత్యం ఆకలితో అల్లాడేట్లుగా చేస్తున్న ఈ అవినీతి-అక్రమాల భూతాన్ని నిర్ధయగా నిర్జించి, ప్రజలకు దివ్యమైన దీపావళి కాంతులను అందించాలి. దేశానికి పట్టిన అవినీతి చీడ వదిలిననాడే అది సాధ్యమవుతుంది. ఇదే అందరి లక్ష్యం కావాలి. ఈ నవరాత్రుల శుభవేళ..ఈ పవిత్రమైన కర్తవ్యానికి ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలి. అందుకు శ్రీకారం చుడుతూ..ఇప్పటికే న్యాయస్థానాలు మనకు ముందుదారి చూపుతున్నాయి. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు సంబంధించిన కేసులో బెంగళూరు ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు అందుకు తాజా ఉదాహరణ. ఎంతో ఉన్నతమైన పదవిలో వుంటూ, ప్రజలను పాలించే ముఖ్యమంత్రిగా వున్న జయలలితకు సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఆమెకు నాలుగేళ్ళపాటు జైలుశిక్ష, నూరు కోట్ల రూపాయల జరిమానా విధిస్తూ, బెంగళూరు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జాన్ మైకేల్ డీ చున్హా రూపంలో వచ్చిన తీర్పు ఎంతో సంచలనం. ఇది అక్రమార్కులకు చెంపపెట్టుగా భావించవచ్చు. నిజాయితీకి, నిర్భీతికి నిలువెత్తు పతాకగా అందరి ప్రశంసలూ అందుకున్న ఆ జడ్జి ఇచ్చిన ఈ సంచలనాత్మక తీర్పు భారత న్యాయవ్యవస్థ గౌరవాన్ని, ప్రతిష్టను ఆకాశమంతగా పెంచినట్లయింది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరెంతటి వారైనా సరే, చట్టం ముందు అందరూ సమానులేనని, న్యాయం అందరికీ ఒక్కటేననీ, ప్రత్యేకించి అవినీతి-అక్రమార్కుల భరతం పట్టేందుకు న్యాయస్థానాలు ఎల్లవేళలా కొరడా పట్టుకుని వుంటాయనే పరమసత్యాన్ని ఈ తీర్పుతో మరింత స్పష్టంగా, కళ్ళకుకట్టేవిధంగా నిరూపించినట్లయింది. ఆ న్యాయమూర్తి చెప్పిన తీర్పు తమిళనాడు రాజకీయాలను తీవ్రంగా ప్రభావం చేయడమే కాక, దేశవ్యాప్తంగా రాజకీయరంగంలో పెనుసంచలనం సృష్టిస్తోంది కూడా. ఉన్నతమైన పదవులను అడ్డం పెట్టుకుని, మనల్ని ఇక ఎవరూ ఏమిచేయలేరనే అహంభావంతో వ్యవహరిస్తూ, పొరపాటునో గ్రహపాటునో ఒకవేళ పట్టుబడినా తప్పించుకునేందుకు కావాల్సినంత ధనముంది..బోలెడన్ని ఉపాయాలున్నాయనే ధీమాతో వుండే అక్రమార్కులందరికీ ఈ తీర్పు ముచ్చెమటలు పోయిస్తోంది.. అక్రమార్కుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తోంది. అయినా, ఒకనాటి మేటి సినీనటీమణిగా, మకుటం పెట్టుకున్న మహరాణిగా వుంటూ, దాదాపు 140 కిపైగా సినిమాల్లో నటించి పేరెన్నికగన్న జయలలితకు రూ. 66 కోట్ల సంపాదన అనేది పెద్ద లెక్కేమీ కాదు. ఆమె తలుచుకుంటే కోట్లు ఆమె కాళ్ళముందు వాలుతాయి. ఆ తర్వాత రాజకీయరంగంలోనూ ఆమె సాటిలేని నేతగా రాణించారు. ప్రత్యర్థులకు సింహస్వప్నం అనిపించారు కూడా. అయితే, ఎంత ఖ్యాతి గడించినా.. ఆమె చివరికి అక్రమాల ఊబిలో కూరుకుపోయారు. ముఖ్యమంత్రిగా వుంటూ, పదవిని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడి ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారంటూ వచ్చిన ఆరోపణలు ఆమెకు తీరని శోకం మిగిల్చాయి. ఆ ఆరోపణలన్నిటినీ న్యాయస్థానం సుదీర్ఘకాలం పాటు కూలంకుషంగా విచారించి, ఈ కేసులో ఆమెకు జైలుశిక్ష విధించింది. దీంతో ఆమె వైభవోపేతమైన జీవితం.. దోషిగా, అత్యంత దయనీయంగా జైలు గోడల మధ్యకు తలవంచుకుని వెళ్ళిపోయింది. ఆమె రాజకీయ జీవితానికి కూడా తెరపడినట్లయింది. ఆమెతో పాటు, మరో ముగ్గురు నిందితులకు కూడా ఈ కేసులో న్యాయస్థానం శిక్ష విధించింది. ఇంతకీ కథలో నీతి ఏమిటంటే.. ప్రజాజీవనంలోకి వచ్చిన నాయకులు, ప్రజలను పాలించే నేతలు ఎంతో పవిత్రంగా, అవినీతిరహితంగా..బాధ్యతాయుతంగా వుంటూ తమ విధులను నిర్వర్తించాలన్నదే ఇక్కడ సారాంశం. అంతేకానీ, ధనదాహంతో అడ్డగోలు సంపాదనలకు పాల్పడితే, ఎవరెంతటి పదవుల్లో వున్నవారైనా సరే..పరిస్థితి చివరికి ఇలాగే వుంటుందని.. ఈ తీర్పు స్పష్టం చేసినట్లయింది. అక్రమార్కులకు చెంపపెట్టైనట్లయింది. అయినా, రానురాను ఒక్క రాజకీయ రంగంలోనే కాదు, దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ప్రక్షాళన చేయాల్సింది ఇంకా ఎంతో వుంది. ఇకనైనా న్యాయవ్యవస్థతో పాటు, మేధావులు, ప్రజలు అందరూ కలసి.. ఈ పవిత్రయజ్ఞానికి అందరూ సమాయత్తం కావాలి. దేశమంతటా వేళ్ళూనుకునిపోయి వున్న అవినీతి అక్రమాల వృక్షాన్ని కూకటి వేళ్ళతోసహా పెకలించి స్వచ్ఛమైన, అవినీతి రహితమైన భారత్‌ను నిర్మించుకోవాల్సిన తరుణం ఇదే. అందుకు ప్రతిఒక్కరం చిత్తశుద్ధితో కంకణబద్ధులం కావాలి. అదే జాతికి నవోదయం... శుభోదయం కావాలి. ప్రజలందరికీ అదే విజయాల వెలుగులబాట కావాలి.

# జయ! జయహే!.. మహిషాసురమర్ధిని!..

- వైభవంగా శరన్నవరాత్రి పూజలు
- భక్తులతో కళకళలాడుతున్న ఆలయాలు

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాలన్నీ కళకళలాడుతున్నాయి. విద్యుద్దీప కాంతులతో ఆలయాలు తేజరిల్లుతుండగా, విశేష పుష్పాలంకరణలు, విశిష్టమైన పూజలతో అమ్మవారి కోవెలలు భక్తుల రద్దీతో కిటకిట లాడుతున్నాయి. శరన్నవరాత్రుల రోజుల్లో ముఖ్యంగా గృహిణులు, మహిళలు పెద్దసంఖ్యలో నిత్యం ఆలయాలకు విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహిస్తుండడం ఎంతో కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఒక్క మన భారత దేశంలోనే కాదు, దేశ విదేశాల్లో సైతం ఈ దసరా పండుగను ఘనంగా నిర్వహిస్తూవుంటారు. మన పండుగల్లో దసరా పండుగకు ఎంతో ప్రాధాన్యతవుంది.

పురాణాల్లోనూ దసరా వైశిష్ట్యం ఎంతో వుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ దసరా ఉత్సవాలను ఆనందోత్సాహంతో జరుపుకొంటూ వుంటాం. దుర్మార్గుడైన మహిషాసురుని సంహరించి.. దుష్టత్వాన్ని నిర్జించి లోకాలకు శాంతినీ కాంతినీ ప్రసాదించింది ఆ జగన్మాత.. దుర్గాదేవి. తొమ్మిది రోజుల పాటు ఆ రాక్షసునితో యుద్ధం చేసిన దుర్గాదేవి, పదవ రోజున మహిషాసురుని సంహరించి విజయం సాధించిందని పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకు ప్రతీకగా అమ్మవారిని పూజిస్తూ ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం, విజయదశమిని ఒక పర్వదినంగా మరింత ఉత్సాహంతో జరుపుకోవడం ఎంతో కాలం నుంచి మనకు ఆనవాయితీగా వచ్చింది. ఈ సందర్భంగా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు మొత్తం తొమ్మిదిరోజుల పాటు



దేవీ పూజలతో.. నవరాత్రి మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతాయి. పదవ రోజు విజయదశమి పర్వదినం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తేజస్సుతో ఆవిర్భవించిన మహాశక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవి అమ్మవారు మహిషాసురునితో యుద్ధం చేసి, పదవరోజైన దశమి రోజున విజయం సాధించింది కనుక, ఆ రోజును విజయదశమి పర్వదినంగా జరుపుకుంటూ వుంటాం. ఈ పది రోజుల వేడుకలన్నిటినీ కలిపి దసరా అని వ్యవహరిస్తారు. శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను షోడశోపచారాలతో పూజిస్తారు. వివిధ అలంకారాలతో, దేవీ రూపాలతో వైభవంగా అలంకరించి పూజలు చేస్తుంటారు. బాలత్రిపురసుందరి, శ్రీ రాజరాజేశ్వరి, గాయత్రి, అన్నపూర్ణ, మహిషాసురమర్ధిని, మహాకాళి, కనకదుర్గ, లక్ష్మీ, సరస్వతి తదితర రూపాల్లో అమ్మవారిని అలంకరిస్తారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అమ్మవారు వివిధ రూపాల్లో అవతరించి దుష్ట సంహారం చేసినందుకు ప్రతీకగా అమ్మవారికి ఇలా పలు రూపాల్లో అలంకరణలు చేసి పూజలు చేస్తుంటారు. దుర్గాదేవి ధైర్యస్థైర్యాలను ప్రసాదించే శక్తిస్వరూపిణి. సకలైశ్వర్య ప్రదాయిని మహాలక్ష్మి. జ్ఞానప్రదాత, విద్యాదాత సరస్వతీదేవి. ఇలా అమ్మవారిని అనేక రూపాల్లో కొలుస్తుంటారు. ఈ శరన్నవరాత్రి రోజులు ఎంతో విశిష్టమైనవని, పుణ్యప్రదమైనవని..జగజ్జనని అయిన ఆ దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల పాపాలూ తొలగిపోయి, కష్టాలు తీరిపోయి..సర్వ శుభాలూ కలుగుతాయని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

## తగిన శాస్తి జరిగింది


జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తు మీద గెలిచి, డబ్బు కోసం, అధికారం కోసం తెలుగుదేశంలో చేరిన 8మంది జడ్పీటీసీలపై అనర్హత వేటు వేస్తూ జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం, హర్షణీయం. ఈ నిర్ణయాలు గోడ మీద పిల్లుల్లాంటి నాయకులకు చెంపపెట్టు కావాలి. ఒక పార్టీలో గెలిచి, వెంటనే ఇంకో పార్టీలో చేరే నాయకులను జీవితాంతం ఏ ఎన్నికలలోనూ పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించాలి.

**కలివేటి వాసు, నెల్లూరు.**

## శెభాష్ మోడీ

అమెరికా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాలు ప్రజలను ఉత్తేజపరిచాయి. ముఖ్యంగా ప్రవాసభారతీయులను ఆకట్టుకున్నాయి. తమ మాతృదేశ అభివృద్ధి కోసం ఎన్నారైలు సైతం తరలివచ్చేలా మోడీ చతురత చూపారు. ఒకప్పుడు తనకు వీసా ఇవ్వడానికి నిరాకరించిన అమెరికా ప్రజల మనసులనే మోడీ దోచుకున్న తీరు అద్భుతం.

**జి.వి.ప్రసాద్, చేజర్ల.**




## అక్రమ ఆస్తులు ఎందరికి లేవు?

కిళ్లీ కొట్టు పెట్టుకున్నోళ్లు కోట్లు గడిస్తున్నారు. దొంగ రవాణా చేసి, భూ ఆక్రమణలు, రౌడీయిజం చేసి కోట్లు గడిస్తున్నారు. అయితే కొందరు మాత్రమే పట్టుబడుతున్నారు. ఎన్నో ఏళ్లు సినీపరిశ్రమలో వుండి, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన జయలలిత వద్ద 66కోట్లు ఉండడం పెద్ద సమస్య కాదు. కాకపోతే ఇది ఆమె దురదృష్ట మనుకోవాలి. 2జీ దొంగలు, బొగ్గుదొంగలు, గనుల దొంగలు... ఇంకా చాలామంది అవినీతి దొంగలకు శిక్షలు పడాల్సివుంది.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## అభివృద్ధి వైపు...
# పడని అడుగు





**రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వందరోజులు దాటింది. ప్రభుత్వమూ, పరిపాలన అన్నాక అభివృద్ధిలో కొంతన్నా మార్పు కనిపించాలి. అభివృద్ధి పరంగా ఒక అడుగన్నా ముందుకు పడాలి. నెల్లూరుజిల్లాలో అలాంటి వాతావరణమేమీ లేదు. నెల్లూరుజిల్లాలో అసలు పరిపాలన లేనట్లుగానే ఉంది. సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో జిల్లాలో ఎటువంటి పరిస్థితులున్నాయో, రాష్ట్ర విభజన జరిగి రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. ఇంకా ఒకరకంగా చెప్పాలంటే పరిస్థితి మనుపటికంటే ఘోరంగా వుంది.**

రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం ఈ జిల్లాతో మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా ఈ జిల్లా మంచి చెడ్డలు చూడాల్సిన రాష్ట్ర మంత్రి పి.నారాయణ ఈ జిల్లాపై దృష్టి సారించడం లేదు. జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడే దిక్కనుకున్నారు. కానీ, ఆయన కూడా జిల్లాపై అంతగా శ్రద్ధ చూపడం లేదు. 1999-2004ల మధ్య ఎన్డీఏ ప్రభుత్వంలో వెంకయ్యనాయుడు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు. అప్పుడు 30మందికిపైగా కేంద్రమంత్రులను నెల్లూరుజిల్లాకు తీసుకొచ్చి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయించారు. వెంకయ్యలో ఆరోజున్న స్పీడ్ ఈరోజు లేదు. నెల్లూరుజిల్లాలో అభివృద్ధి పనులు చేయాలన్న ఆసక్తి ఆయనలో తగ్గినట్లు కనిపిస్తోంది. బహుశా ఫలితాల పట్ల నిరాశే ఇందుకు కారణం కావచ్చు. విజయవాడ మీద చూపుతున్న శ్రద్ధ ఆయన నెల్లూరుజిల్లా మీద చూపడం లేదు. ఆయనే గనుక శ్రద్ధపెట్టి వుంటే కేంద్రం మంజూరు చేసిన జాతీయ విద్య, వైద్య, ఇతర సంస్థలలో ఒక్కటైనా నెల్లూరుకు వచ్చి వుండేది. వెంకయ్యే చొరవతీసుకుని వుంటే కేంద్రం ప్రకటించిన స్మార్ట్ సిటీల జాబితాలో ఖచ్చితంగా నెల్లూరు పేరుండేది. జిల్లా నుండి రాష్ట్ర మంత్రిగా వున్న పి.నారాయణ కూడా జిల్లా అభివృద్ధిపై దృష్టిపెట్టడం లేదు. మా జిల్లాకు ఇది కావాలని ఆయన సీఎంను గట్టిగా అడగడం లేదు. ఆయన రాజధాని భూములు, పరిపాలనా వ్యవహారాలు మాత్రమే చూసుకుంటున్నారు. ఇలా అటు కేంద్రమంత్రి గాని, రాష్ట్రమంత్రి గాని జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టకపోవడంతో జిల్లాలో పరిస్థితులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి.

# తడలో బూమ్.. జిల్లా అంతా డామ్!

## ● ఘోరంగా రియల్ మార్కెట్

***రాష్ట్ర విభజన జరిగాక నెల్లూరు జిల్లాలో రియల్ మార్కెట్ జెట్ వేగంతో దూసుకుపోతుందనుకున్నారు. కానీ అలా జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకన్నా మార్కెట్ వస్తుందనుకున్నారు. ఆ విధంగానూ జరగలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే నెల్లూరుజిల్లాకు శాపంలా వుంది. ఈ జిల్లా అభివృద్ధి కోసం ఆయన ఏ ఒక్క పని కూడా చేయడం లేదు. దీంతో ఎన్నికల తర్వాత ఆశించిన రియల్ వ్యాపారం లేకుండాపోయింది.***

అయితే రాష్ట్రంలో రెండే రెండుచోట్ల రియల్ వ్యాపారం జోరుమీదుంది. మొదటిది రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన కృష్ణా-గుంటూరు జిల్లాల్లో అయితే రెండోది నెల్లూరుజిల్లా తడ ప్రాంతంలో. రాజధాని ప్రభావంతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కొనలేనంతగా భూముల ధరలు పెరిగాయి. అదే సమయంలో తడలోనూ భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడం విశేషం. దీనికి కారణం ఈ ప్రాంతం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుండడమే! 2004 నుండి కూడా తడ, సూళ్లూరుపేటలలో పారిశ్రామిక శకం మొదలైంది. అపాచీ వంటి బూట్ల కంపెనీతో పాటు 'శ్రీసిటీ' వంటి సక్సెస్‌ఫుల్ సెజ్ వచ్చింది. ఈ సెజ్‌లోకి ఎన్నో బహుళ జాతి కంపెనీలు వచ్చాయి. దీంతో ఆటోమేటిక్‌గా రియల్ వ్యాపారం జోరందుకుంది. తడలో ఎకరా 3కోట్ల రూపాయల దాకా, రోడ్డుపక్కన స్థలం అంకణం 2లక్షల రూపాయల దాకా పలుకుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న 'హీరో' కంపెనీ కూడా ఈ ప్రాంతానికి సమీపంలోనే నెలకొల్పుతుండడం, 'నైకీ' షూ పరిశ్రమ కూడా ఇక్కడే మంజూరు కావడంతో ఇంకొంచెం ఊపు వచ్చింది. అట్లాగే ఓ విదేశీ కంపెనీ ఇరకందీవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పూనుకోవడం, మరోపక్క కొందరు సినీ నిర్మాతలు ఇక్కడ స్టూడియోలను నెలకొల్పాలనే ఆలోచన చేస్తుండడంతో ఇక్కడ ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో జిల్లాలో రియల్ మార్కెట్ లేదు. నెల్లూరు నగరంతో పాటు ముత్తుకూరు, కావలి, గూడూరు, బుచ్చి వంటి రియల్ వ్యాపారం జరిగే ప్రాంతాల్లో వ్యాపారులు పనీపాటా లేక గోళ్లు గిల్లుకుంటున్నారు. కాని ఈ జిల్లాలోనే అందుకు భిన్నంగా తడ, సూళ్లూరుపేట ప్రాంతాలలో మాత్రం రియల్ మార్కెట్ వేగంగా నడుస్తోంది.



## ఆదాలకు రూరల్ కిరీటం

గత ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుండి పోటీ చేస్తాడనుకున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి చివరకు నెల్లూరు లోక్‌సభ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయడం తెలిసిందే! ఆదాల కొద్ది ఓట్ల తేడాతో ఎంపీ స్థానం నుండి ఓటమి పాలయ్యారు. అదే సమయంలో నెల్లూరు రూరల్ బీజేపీకి ఇవ్వడంతో ఇక్కడ కూడా ఆ పార్టీ ఓడిపోయింది.

ఎన్నికలకు ముందు సీట్ల కోసం పోటీ పడ్డ నేతలు, ఇప్పుడు ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ పదవుల కోసం వెంపర్లాట మొదలుపెట్టారు. ఓడిపోయినప్పటికి అధికారపార్టీ నాయకులు ఇన్‌ఛార్జ్‌ల హోదాలో అధికారం చెలాయిస్తుండడంతో అందరి కన్ను ఇన్‌ఛార్జ్ పదవులపై పడింది. నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆదాల నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ పదవికి ప్రయత్నించారు. ఈ నియోజకవర్గానికి కన్వీనర్‌గా వున్న కిలారి వెంకటస్వామినాయుడు కూడా ఇన్‌ఛార్జ్ పదవిని కోరుకున్నారు. అయితే ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నాయకులతో జరిపిన సమీక్షలో రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించారు. ఆదాలను రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించడం వెనుక మంత్రి పి.నారాయణ హస్తం కూడా వుంది. ఆదాలను ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించడంతో కిలారి నీరుగారిపోయాడు.




జననం 01.01.1932

మరణం 26.09.2014

# ఉత్తరక్రియలు



పూజ్యులు, మాకు మార్గదర్శకులు, దైవసమానులు

## గునపాటి పరంధామరెడ్డి గారు

(అధినేత, జిపిఆర్ గ్రాండ్ కల్యాణ మండపం)

తే. 26.9.2014ది శుక్రవారం పరమపదించినారు.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య - **విజయలక్ష్మి**

కుమారుడు - కోడలు


**జి.వి.కృష్ణారెడ్డి - ప్రశాంతి**

కుమార్తె - అల్లుడు

**పోచారెడ్డి ఝూన్సీ - రామ్‌మోహన్‌రెడ్డి**

మరియు **మనుమలు మనుమరాళ్ళు**

**ఉత్తరక్రియలు:** తే. 08.10.2014ది బుధవారం ఉదయం 10గంటలకు మాగుంట లే అవుట్, 2వ మెయిన్‌రోడ్, రోడ్‌నెం.1లోని సిద్ధివినాయక అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.10 నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



తాను ఎంచుకున్న ఏ రంగంలోనైనా తనే నంబర్1గా నిలవాలనే తత్వం, తాను చేపట్టిన ఏ కార్యక్రమమైనా వినూత్న రీతిలో ఉండాలని సంకల్పించే మనస్తత్వం, అజాతశత్రువులా అన్ని రంగాల వారితోనూ, అన్ని రాజకీయపార్టీల నాయకులతోనూ, అన్ని భాషల సినీరంగ ప్రముఖులతోనూ స్నేహబాంధవ్యాలను కొనసాగించే వ్యక్తిత్వం, ఆపదలో వున్నవారిని ఆదుకోవడంలోనూ, ఆకలేసిన వారికి అన్నం పెట్టడంలోనూ, తనను అర్థిస్తే లేదనకుండా దానం చేయగలిగే దాతృత్వం.. ఇవన్నీ కలబోసి మూర్తీభవించిన మానవత్వం కలిగిన వ్యక్తి డా॥ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి. ఆయన 71వ జన్మదినం సందర్భంగా కేంద్రమంత్రివర్యులు ముప్పవరపు వెంకయ్యనాయుడు సారథ్యంలో ఏర్పడిన ఆతిథ్య సంఘం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్ హోటల్లో సెప్టెంబర్26వ తేదీన సుబ్బరామిరెడ్డిని ఘనంగా సత్కరించింది.

## ఆత్మీయంగా 71వ జన్మదినం

విజయవంతమైన అర్థవంతమైన 71 సంవత్సరాల జీవిత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా "మీట్ & గ్రీట్" పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వెంకయ్య నాయుడి అధ్యక్షతన జరిగిన ఈ సత్కార సంబరంలో వివిధ ప్రాంతాలకు చెందిన రాజకీయనాయకులతో పాటు సినీనటులు, వైద్యప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని సుబ్బరామిరెడ్డిని అభినందించారు.

# ఎవర్‌గ్రీన్ హీరో సుబ్బరామిరెడ్డి

## పొగడ్తలతో ముంచెత్తిన వెంకయ్యనాయుడు

ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మంచివాడు, మనసున్నవాడు, మనందరివాడు అయిన సుబ్బరామిరెడ్డిని అభినందించుకోవడానికి మనమంతా ఒక్కచోట చేరడం శుభదాయకమని, ఇలాంటి కార్యక్రమాన్ని తానెప్పుడూ చేపట్టనని, కాని సుబ్బరామిరెడ్డి మంచితనాన్ని గుర్తించడం బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని తానే స్వయంగా పూనుకుని ఏర్పాటు చేశానని చెప్పాడు. మంచిని గుర్తించడం, మంచిని గౌరవించడం, మంచిని సత్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పాడు. సుబ్బరామిరెడ్డిని చాలా దగ్గరగా చూస్తుంటానని, ఆయన చేపట్టే అన్ని కార్యక్రమాలలోనూ పార్టీల కతీతంగా, కులాలకతీతంగా, మతాలకతీతంగా అందరినీ ఒకే వేదికపైకి చేర్చగల ఐకమత్య భావాలు గల వ్యక్తి సుబ్బరామిరెడ్డని అన్నారు. వ్యక్తిత్వము, మిత్రత్వము, వక్తృత్వము, భక్తృత్వము, దాతృత్వము కలిస్తే సుబ్బరామిరెడ్డి అని కీర్తించాడు.

రాజకీయపార్టీలు, ఆయా పార్టీల నాయకులు, వారి యొక్క భావాలు సిద్ధాంతాలు వేరు తప్ప రాజకీయవేత్తలంతా శత్రువులు కాదని, ముందుగా మనమంతా భారతీయులం ఆ తరువాత వివిధ పార్టీల ప్రతినిధులమే తప్ప తానెప్పుడూ ఇతర పార్టీల వారిని శత్రువుగా చూడనని, వారిని ప్రత్యర్థులుగానే భావిస్తానని చెప్పారు. సుబ్బరామిరెడ్డి వుండే పార్టీ అంటే తనకసలు పడదని, కాని సుబ్బరామిరెడ్డంటే గౌరవమని అన్నారు. రాజకీయం వేరు ప్రజాజీవనం వేరని అన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులైన ప్రతిఒక్కరూ నాయకులేనని, సినిమాల్లో హీరోలు నాయకులైతే, ప్రతి నాయకుడు కూడా నాయకుడేనని, విద్య, వైద్యం, క్రీడారంగాలతో పాటు ఇతర అన్ని రంగాలలోనూ తన ప్రతిభను చాటి అగ్రస్థానంలో నిలిచే వారందరూ నాయకులేనని, దురదృష్టవశాత్తు మనం రాజకీయవేత్తలనే నాయకులుగా చూస్తున్నామని అన్నాడు. సుబ్బరామిరెడ్డి తనకంటే వయస్సులో పెద్దవాడైనా చిన్నవాడిలా కనిపిస్తాడని, తాను బాగా అరిగానని, సుబ్బరామిరెడ్డి అరగలేదని చమత్కరిస్తూ నిత్యనూతన యవ్వనం సుబ్బరామిరెడ్డి సొంతం అని, అందుకే ఆయన "ఎవర్‌గ్రీన్ హీరో" అని కితాబునిచ్చాడు వెంకయ్యనాయుడు.



### నాకు చాలా విషయాల్లో స్ఫూర్తి ప్రదాత సుబ్బరామిరెడ్డి గారు

**- మెగాస్టార్ చిరంజీవి**

కొన్ని కార్యక్రమాలకు తప్పనిసరై వెళ్తుంటామని మరికొన్ని సభలకు కష్టంగా వెళ్తుంటామని, కాని సుబ్బరామిరెడ్డి గారి కార్యక్రమానికి మనస్ఫూర్తిగా, ఇష్టంగా, ఆత్మీయానురాగాలు పంచుకోవడానికే వస్తుంటానని మెగాస్టార్ చిరంజీవి తన మాటల్లో అన్నారు. సుబ్బరామిరెడ్డి గారి చేతులమీదుగా ఎన్నో రంగాలకు చెందిన వారికి సన్మానం చేశారు తప్ప ఆయన సత్కారాన్ని అందుకోవడం తన 30సంవత్సరాల పరిచయంలో తాను ఇదే మొదటిసారిగా చూస్తున్నానని అన్నాడు.

ముందుగా తాను ఈ సభ నెల్లూరు సంబంధంతో జరుగుతుందేమో, వెంకయ్యనాయుడు నెల్లూరు వారు కావడం తనకీ నెల్లూరుతో సంబంధం వుండడంతో తనను ఆహ్వానించారని అనుకున్నానని, కానీ ఇక్కడకు వచ్చిన తరువాత ఇది హార్ట్ టు హార్ట్ సంబంధంతో జరుగుతున్న కార్యక్రమమని అర్థమయ్యిందన్నాడు. నెల్లూరుతో సంబంధమే లేని ఎంతోమంది ప్రముఖులు మా సుబ్బరామిరెడ్డి, మన సుబ్బరామయ్య, మా సుబ్బరామ్ అని చెప్పడం చూస్తే ఈ సభలో తాను భాగస్వామ్యుడినైనందుకు గర్వపడుతున్నానన్నాడు.

ఎంత పెద్ద కార్యక్రమం చేపట్టినా అలుపూ సొలుపూ లేకుండా చూడడం, ఎన్నో సందర్భాల్లో ఆయన గురించి అనేక విషయాలు తెలుసుకోవడంతో పాటు ఇంకా చాలా విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం తనకు ఏర్పడిందని, అందుకు సుబ్బరామిరెడ్డి గురించి రీసెర్చ్ చేద్దామనుకుంటున్నానని అన్నాడు. తాను ఏదైనా మనస్థాపానికి గురైనప్పుడు సుబ్బరామిరెడ్డి గారిని తలుచుకుంటానని, ఆయనలోని చలాకీతనం, ఆయన ముఖంలోని తేజస్సు తనకు ప్రశాంతతను ఇస్తుందని అనేక సందర్భాల్లో అనేక విషయాల్లో ఆయన తనకు స్ఫూర్తిప్రదాత అని చిరంజీవి అన్నాడు.




















### ఆయనో విశిష్టవ్యక్తి, అసమాన శక్తి

**- పరుచూరి, బ్రహ్మానందం, కామినేని శ్రీనివాస్, ప్రతాప్ సి రెడ్డి, గంటా శ్రీనివాసరావు, జానారెడ్డి**

సుబ్బరామిరెడ్డి కేవలం ఓ వ్యక్తి కాదని, ఆయనో అసాధారణ శక్తి అని సభలో పాల్గొన్న ఇతర వ్యక్తులు అన్నారు. రాజకీయం, సేవారంగం, ఆధ్యాత్మిక రంగం, క్రీడారంగం, కళారంగం, సినిమారంగం, వైద్యరంగం, సాహితీ రంగంతో పాటు ప్రతి విభాగంలోనూ సమాంతర న్యాయం పాటిస్తూ వీటన్నిటితో పాటు ఓ బడా పారిశ్రామికవేత్తగా, అంతర్జాతీయస్థాయి వ్యాపారవేత్తగా రాణించగలగడం సామాన్యమైన విషయం కాదని, ఆయన ఏ రంగంలో ఏ పనిచేపట్టినా చిత్తశుద్ధితో కార్యదక్షతతో ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తాడని, ఇది అనితర సాధ్యమైన విషయమేనంటూ ఈ సభలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావులతో పాటు అపోలో హాస్పిటల్స్ ఛైర్మెన్ ప్రతాప్ సి రెడ్డి, సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, సినీ నటుడు బ్రహ్మానందం, మాజీమంత్రి జానారెడ్డి తదితరులు సుబ్బరామిరెడ్డిని కీర్తించారు.

### ఎదుటివారి ముఖంలో ఆనందమే నాకు పవర్

**- సుబ్బరామిరెడ్డి**

మనస్ఫూర్తిగా భగవంతుడికి పూజచేస్తే ఎంత ఆనందం కలుగుతుందో, భక్తిభావంతో ధ్యానం చేస్తే ఎంత సుఖంగా హాయిగా వుంటుందో మనకు తెలిసిన వ్యక్తి మన ముందు అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తే మనసుకు అంతే సంతోషంగా వుంటుందని అలాంటి ఆనందాన్ని తాను వెంకయ్యనాయుడిని చూసి పొందుతున్నానని సుబ్బరామిరెడ్డి అన్నారు. తాను గత 52సంవత్సరాలుగా ఎంతోమంది ప్రధాన మంత్రుల్ని, ముఖ్యమంత్రుల్ని చూశానని, ఎంతోమంది మంత్రులతో పనిచేశానని కానీ ఈరోజు మోడీ మంత్రివర్గంలో కీలకస్థానంలో మనవాడు మన నెల్లూరువాడు మన మధ్య వుండే మనందరివాడు వెంకయ్యనాయుడు వుండడం తనకెంతో గర్వంగా వుందని అన్నాడు. అధికారం వున్నా లేకున్నా ఒకేరకంగా వుంటూ అధికారంలోకి వచ్చాక మనిషిని ఇంకా ప్రేమగా పలుకరిస్తూ మానవత్వంలో దైవత్వాన్ని చూసే వ్యక్తి వెంకయ్యనాయుడని అన్నాడు. పార్టీలకతీతంగా, సిద్ధాంతాల కతీతంగా స్నేహ బంధానికి విలువనిచ్చి సాటి తెలుగువాడిగా అందరినీ గౌరవించే "కోహినూర్ డైమండ్ ఆఫ్ తెలుగు పీపుల్" అని వెంకయ్యకు సుబ్బరామిరెడ్డి కితాబునిచ్చాడు.

తనకు పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలు ముఖ్యం కాదని, వీటన్నిటికీ అతీతంగా వ్యక్తులను వారిలోని వ్యక్తిత్వాన్ని ప్రేమిస్తానని మంచి ఎక్కడున్నా మానవత్వం ఎక్కడున్నా గౌరవిస్తానని సుబ్బరామిరెడ్డి అన్నాడు. అందరూ బాగుండాలి అనే తన సిద్ధాంతమే ఇంతమందికి నన్ను ఆత్మీయుడిని చేసిందన్నారు. నేను ఏ పని చేపట్టినా ఎదుటవారి ముఖంలో ఆనందాన్ని చూడడానికే ఇష్టపడతానని, వాళ్ళు ఆనందంగా వున్నప్పుడే నాకు పవర్ వచ్చి నేను చేసేపనికి సార్థకత లభిస్తుందని భావిస్తానని అన్నారు.

***అతిచిన్న వయస్సులో నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణంలో కాంట్రాక్టర్‌గా భాగస్వామ్యుడనై 23ఏళ్ల వయస్సులోనే నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నుండి బంగారు పతకాన్ని అందుకుని, 26యేళ్ల వయస్సులో బంజారాహిల్స్‌లో అక్కినేని నాగేశ్వరరావు ఇంటి ప్రక్కనే ఆయన ఇంటికన్నా మంచి ఇల్లు కట్టి ఎవరయ్యా ఈ కుర్రవాడు అని అందరూ ఆశ్చర్యపడేలా గ్లామర్‌ను సంపాదించి అలా మెట్టుమెట్టుగా ఎదిగి అకుంఠితదీక్షతో, అచెంచల విశ్వాసంతో, అవిరామ కృషితో వివిధ రంగాలలో విజయాలు సాధించి ఈ స్థాయికి వచ్చానన్నాడు.***

ఈనాడు ఇంత మంది ఆత్మీయుల ప్రేమానురాగాలను పొందగలిగి నా ఈ 71సంవత్సరాల జీవితంలో తొలిసారిగా సన్మానానికి ఒప్పుకున్నానని అన్నాడు.









*పరమ శివభక్తుడైన డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి తన ఇష్ట దైవానికి తగ్గట్లుగానే భోళా శంకరుడనే పేరుంది. రాజకీయంగా ఆయన తన నరనరాన కాంగ్రెస్‌పార్టీ రక్తాన్ని జీర్ణించుకున్నప్పటికీ అన్ని పార్టీల్లోని ప్రముఖ నాయకులందరూ ఆయనకు మిత్రులే! ఒక్క రాజకీయ రంగం నుండే కాదు, అటు పారిశ్రామిక రంగమైనా, సినీరంగమైనా, కళారంగమైనా... సుబ్బరాముడికి సంబంధించి ఏ చిన్న వేడుక జరుగుతున్నా ఆ రంగాల ప్రముఖులు తమ ఇంట్లో కార్యక్రమం అన్నట్లుగా రెక్కలు కట్టుకుని వాలిపోతారు. సుబ్బరామయ్య 71వ జన్మదినోత్సవ వేడుకలు ప్రతియేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విశాఖలో నిర్వహించారు. అయితే హైదరాబాద్‌లో ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించి టియస్‌ఆర్‌ను సత్కరించిన ఘనత మాత్రం మన జిల్లా వాసి, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడికే దక్కుతుంది.*

తన భవిష్యత్‌లో తాను ఇంకా ఎంత ఎక్కువ మందిని సంతోష పెట్టగలిగితే ఎంత ఎక్కువమంది ముఖాలలో ఆనందం చూడగలిగితే తన జన్మకి అంత సార్థకత అని అన్నారు. ఈరోజు తన కోసం ఇక్కడికి వచ్చి ప్రేమతో అభిమానంతో ఆత్మీయతతో తనని సత్కరించిన ప్రతిఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నాడాయన.

ఈ కార్యక్రమంలో ఎంపీలు కె.వి.పి.రామచంద్రరావు, మురళీమోహన్, కంభంపాటి హరిబాబు, సుజనాచౌదరి, నంది ఎల్లయ్య, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీడీజీపీ వి.దినేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు టి.జి.వెంకటేష్, బొల్లినేని కృష్ణయ్య, కిమ్స్ హాస్పిటల్ అధినేత డా॥ బొల్లినేని భాస్కరరావు, బీజేపీ నాయకులు లక్ష్మణ్, సినీ రంగం నుండి హీరో నాగార్జున, శివాజీ, కృష్ణంరాజు, పరుచూరి గోపాలకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మాడుగుల నాగఫణిశర్మ, ఇతర రంగాల ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా మహిమలూరు వాసి, ప్రఖ్యాత సైంటిస్ట్, ఇమారత్ డైరెక్టర్ డా॥ సతీష్‌రెడ్డిని కూడా సత్కరించారు.



# బదిలీలు విద్యాసంవత్సరం అనంతరమే

**- నెల్లూరుజిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్**




పోలీసుల సాధారణ బదిలీలు విద్యాసంవత్సరం అనంతరం చేస్తామని నెల్లూరుజిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ తెలిపారు. ఇటీవల పోలీసు అధికారులసంఘం సర్వసభ్య సమావేశం నెల్లూరు దర్గామిట్టలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసు అధికారుల సంఘం చర్చించి అజెండా తయారు చేసి ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రెండువారాల్లో పోలీసులకు స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తామన్నారు. వారాంతపు సెలవులను పరిశీలిస్తామని, ర్యాంక్ ఎస్సైలకు పోస్టింగ్ ఇస్తామని, పలు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదనపు ఎస్పీ రెడ్డి గంగాధరరావు మాట్లాడుతూ జిల్లా పోలీసు ఆఫీసులో ఉన్న సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, జిల్లా కార్యదర్శి అంజిబాబు, బాబు, గంగాధర్, శివప్రకాష్, ఏఓ రాజశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రాళ్లపాడు రిజర్వాయర్‌కు సోమశిల నీళ్లు

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు నారాయణ**

నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న రాళ్లపాడు రిజర్వాయర్‌కు సోమశిల ఉత్తరకాలువ ద్వారా సాగునీరు వచ్చేందుకు అందరం కలిసి కృషి చేద్దామని సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు కె.నారాయణ పిలుపునిచ్చారు. ఇటీవల రాళ్లపాడు రిజర్వాయర్ అతిథిగృహం వద్ద ఉత్తరకాలువ సాధన సమితి కార్యదర్శి దామా అంకయ్య అధ్యక్షతన జరిగిన రైతుసదస్సులో నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు భూసేకరణ చేయకుండా ప్రాజెక్టులు, కాలువ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల నిర్మాణాలు ఆగిపోతున్నాయన్నారు. సోమశిల, నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టుల ముంపు గ్రామాలవారికి ఇంతవరకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదన్నారు. ఉత్తరకాలువ విషయంలో కొండాపురం మండలం చింతలదేవిలో భూమిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందడంతో ఆ కాలువ నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కార్యదర్శి ఆర్.వెంకయ్య, కందుకూరు మాజీఎమ్మెల్యే దివి శివరాం, నెల్లూరు, ప్రకాశంజిల్లాల సిపిఐ కార్యదర్శులు రామరాజు, అరుణ, లోక్‌సత్తా సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి, కొండాపురం, కందుకూరు జడ్పీటీసీ సభ్యులు దామా మహేష్, కంచర్ల శ్రీకాంత్, ఉత్తరకాలువ సాధన సమితి కన్వీనర్ వీరారెడ్డి, వరదయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కె.వి.చలమయ్యకు గ్లోబల్ పీస్ అవార్డు



హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ శాంతి దినోత్సవంలో నెల్లూరు నగరానికి చెందిన కె.వి.చలమయ్యకు గ్లోబల్ పీస్ అవార్డును ప్రదానం చేశారు. ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది యం.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చలమయ్య చిన్నతనంలో పొట్టి శ్రీరాములుతో కలిసి పనిచేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ చలమయ్యను సన్మానించి, పురస్కారం అందజేశారు.

# పేదబ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం

నెల్లూరు జిల్లా పరిధిలోని ఉన్నత విద్య నభ్యసిస్తున్న పేద బ్రాహ్మణ ఉన్నత విద్యార్థినీ విద్యార్థులకు పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు కార్యదర్శి రాళ్ళపల్లి రామసుబ్బారావు తెలిపారు. అక్టోబర్1 నుండి 15వ తేదీలోగా ట్రస్టు ఉపాధ్యక్షులు యం.వి.చలంకు దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో బ్రాహ్మణ మహాసభ నెల్లూరు వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు 9550052420, 9908269665 నెంబర్లతో సంప్రదించాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో టిడిపీ విఫలం

**సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**



రాష్ట్రంలో అధికారం చేపట్టి మూడు నెలలు దాటినా ప్రజా సమస్యల పరిష్కారంలో టిడిపీ పూర్తిగా విఫలమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా గూడూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రోజుకో మాట చెబుతూ మభ్యపెడుతున్న చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగెత్తారన్నారు. చంద్రబాబు తొలి అయిదు సంతకాలు చేసిన ఏ పథకం కూడా సక్రమంగా అమలు కావడంలేదన్నారు. ఎమ్మెల్యేలను కాదని రాజ్యాంగేతర శక్తులను పక్కనబెట్టుకుని అధికారులు నడుచుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వైయస్సార్‌సీపి ఎమ్మెల్యేలను, ఎంపీలను, జడ్పీఛైర్మన్‌లను కాదని టిడిపీ నాయకులతో ఫించన్ల కమిటీలు వేసి ఫించన్ల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు నాశిన నాగులు, మల్లు విజయ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ 108వ జయంతి వేడుకలు

భగత్‌సింగ్ 108వ జయంతి వేడుకలను గత నెల 27న నెల్లూరు నగరంలోని వాడవాడలా నిర్వహించారు. బాలాజీనగర్ సిపిఎం కార్యాలయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శులు డి.మురళీమోహన్, కె.సుధాకర్, వెంకటేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. 1వ డివిజన్ శెట్టిగుంటరోడ్డు, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో భగత్‌సింగ్ జయంతి వేడుకలకు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ దత్తాత్రేయ పాల్గొని మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ ఆశయాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, నాగయ్య, నగర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దృష్టికి రైతాంగం సమస్యలు!

**- కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి**



నెల్లూరుజిల్లాలో రైతాంగం ఇబ్బందులను సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని నెల్లూరుజిల్లా కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఆయన తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పర్మిట్లు జారీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కోవూరు చక్కెర కర్మాగారానికి రూ.6.4కోట్ల బకాయిలను విడుదల చేసారన్నారు. జిల్లాలో నష్టపోయిన నిమ్మరైతులకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టిడిపి పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల పాట్లు పట్టించుకోని చంద్రబాబు

**- వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న**




ప్రజల పాట్లు చంద్రబాబుకు పట్టడంలేదని, ఎన్నికలకు ముందు చేసిన ప్రమాణాల ప్రకారం నడుచుకోకుండా ఉన్న పథకాలను తనదైన శైలిలో నిర్వీర్యం చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. గత నెల 27న నెల్లూరుజిల్లా పొదలకూరులో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాలనను పక్కనపెట్టి భూదందాలు సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోనం బ్రహ్మయ్య, తెనాలి నిర్మలమ్మ, రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు తల్లయితే... ఆధార్‌కార్డు పిల్లలాంటిది

**- మాజీఎమ్మెల్యే ఆనం**



రేషన్‌కార్డు తల్లయితే, ఆధార్‌కార్డు పిల్లలాంటిదని, పిల్లను చూసి తల్లిని బోగస్ అనటం సమంజసం కాదని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వ్యాఖ్యానించారు. గత నెల 27న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆధార్ నమోదును విమర్శించిన తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అంశాన్ని ఆధార్‌కు ముడిపెడుతుందని విమర్శించారు. క్రమబద్ధీకరణ పేరుతో సంక్షేమపథకాలకు కోతపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. అక్రమ రేషన్‌కార్డుల ఏరివేత సమంజసమే అయినా 40 నుంచి 50శాతం రేషన్‌కార్డులను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. రేషన్‌కార్డుల ఏరివేతవల్ల, పింఛన్లు, ఫీజురీయంబర్స్‌మెంటు తదితర సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతుందన్నారు. ఎన్నికలకు ముందు రైతు రుణమాఫీని చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు కాలయాపన చేయడం మంచిపద్ధతి కాదన్నారు. కర్షక బ్యాంకు ద్వారా బాండ్లు ఇప్పించేందుకు ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమన్నారు. సంక్షేమ పథకాలకు ఆధార్ నమోదు తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, జిల్లా నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాబా వారి మహాసమాధి, విజయదశమి మహోత్సవములు

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

తేది. 03-10-2014 శుక్రవారం నుండి 05-10-2014 ఆదివారం వరకు

ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును. మధ్యాహ్నం 12గంటలకు సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనగోరు భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/- చెల్లించి తగిన రశీదు పొంది బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము. పై దినములలో ప్రతిరోజు సా॥7.00గం.లకు సాంస్కృతిక కార్యక్రమములు ఉండును.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయి బాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కుటుంబ, ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెట్టగలరు. వృత్తి వ్యాపారాలలో అవిశ్రాంత కృషి, ఆదాయవృద్ధి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, కొత్త కాంట్రాక్టులు అగ్రిమెంట్లు ఆలస్యం కావచ్చును. సమావేశాలు, చర్చలలో మీ సూచనలకు గుర్తింపు గౌరవాలు లభిస్తాయి. ఋణబాధలు కొంతమేరకు పరిష్కారము కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు ఆలస్యం కాగలవు. హామీలకు ఒప్పందాలకు దూరంగా ఉండటం మంచిది. ఈ వారం అదనంగా ఖర్చులు పైనబడగలవు. భూములు, విలువైన వస్తువులు కొనుగోలు వాయిదా పడగలవు. వృత్తిపరంగా విశ్రాంతి దొరకదు. వ్యాపారవర్గాలకు పురోభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. సెన్సెక్స్ ఒడిదుడుకులుగా సాగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలు, సొంత పనులందు ఆటంకాలు ఎదురుకాగలవు. యజమానులకు వర్కర్లతో సమస్యలు ఏర్పడగలవు. క్రొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారులకు నిర్ణయాలు తీసుకొనే సమయమిది కాదు. మంచి వ్యాపారావకాశాలు చేజారిపోవచ్చును. వ్యాపారవర్గాలకు ఆదాయం తగ్గుతుంది. దైవకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలు దొరుకుతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 03.10.2014 నుండి
తేది. 09.10.2014 వరకు

ఈ వారము మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రవి శుక్ర రాహువులు, తులలో శని బుధులు, వృశ్చికంలో కుజుడు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 3 శుక్రవారము విజయదశమి.
శుక్రమౌఢ్యమి జరుగుచున్నందున ఏ రకమైన ముహూర్తములు లేవు.
చంద్రగ్రహణము
తేది 8 బుధవారము సా॥ గం.4.45 నుండి గం.7.05 వరకు చంద్రగ్రహణము.
ఆబ్దికము, భోజనాదులు యధావిధిగా జరుపుకొనవచ్చును.

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 03 | శుక్ర | నవమి | ఉ॥గం.6.28వ॥ |
| | పిదప | దశమి | రా॥గం.4.20వ॥ |
| తేది. 04 | శని | ఏకాదశి | రా॥గం.1.50వ॥ |
| తేది. 05 | ఆది | ద్వాదశి | రా॥గం.11.23వ॥ |
| తేది. 06 | సోమ | త్రయోదశి | రా॥గం.9.00వ॥ |
| తేది. 07 | మంగళ | చతుర్దశి | రా॥గం.6.44వ॥ |
| తేది. 08 | బుధ | పూర్ణిమ | సా॥గం.4.42వ॥ |
| తేది. 09 | గురు | పాడ్యమి | ప॥గం.2.55వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆశించిన ఆదాయం ఉండకపోవచ్చును. కుటుంబ సౌఖ్యము, ఆత్మీయులను, పిల్లలను కలుసుకొనడం జరుగుతుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. వృత్తి జీవనంలో ఆదాయం పెరుగుతుంది. తీరిక ఉండదు. స్థిరాస్తుల వ్యవహారాలు లావాదేవీలను పరిష్కారం చేస్తారు. షేర్లు, స్థిరాస్తుల మీద లాభాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అలర్జీ శ్వాసకోశ బాధలు స్వల్పంగా ఉంటాయి. స్త్రీలకు అనారోగ్య బాధలు, వస్తువాహన గృహరిపేర్లు ఖర్చులు పైనబడగలవు. బంధువర్గంతో సందడిగా ఇల్లుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి వ్యాపకం, ఆర్థికంగా మెరుగైన స్థితి, ఆదాయవృద్ధి ఉంటుంది. క్రొత్త పథకాలు, నిర్ణయాలతో ముందుకు సాగుతారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్త్రీల ప్రతిభకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు చూడటం జరుగుతుంది. వృత్తి వ్యాపార విస్తరణ చేయడముంటుంది. షేర్లు పెట్టుబడుల మీద అవకాశాలు, లాభాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. అయినా ఖర్చులు పెరిగి అదుపు చేయడం కష్టముకాగలదు. ప్రతి నిర్ణయాన్ని శాంతంగా ఆలోచించి తీసికొనడం మంచిది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

గృహ మార్పులు, స్థానమార్పులుండవచ్చును. షేర్ మార్కెట్ కొంత నిరాశ కలిగిస్తుంది. ఎటువంటి సమస్యలైనా ధీటుగా ఎదుర్కొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు పెరిగి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూలత ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. అనుకోకుండా ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంది. అవసరానికి ఋణం చేయవలసి వస్తుంది. సోదరవర్గంతో గాని, బంధువర్గంతో గాని సమస్యలు రాకుండా చూచుకొనాలి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. వాహనాలు నడిపేవారు, విద్యుత్, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తిపరంగా వ్యాపారపరంగా మంచి ఆర్థికావకాశాలు లభించగలవు. ఆర్థిక నిర్ణయాలు, లౌకిక వ్యవహారాలను దూకుడుగా నిర్వహిస్తారు. అయినా తెలివితేటలతోనే నిర్ణయాలు చేస్తారు. వివాహ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉంది. కుటుంబసభ్యుల నుండి దూరబంధువుల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టువ్యవహారాలు వాయిదా పడగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక లావాదేవీలందు ఇతరుల సలహాలను స్వీకరిస్తారు. నిర్మాణాలు కాంట్రాక్టు పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. మీరు చేసే నిర్ణయాలు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయి. క్రీడాకళా సాంకేతిక రంగాలలో వారికి మంచి అవకాశాలు వస్తాయి. సభలు సమావేశాలలో మీ సూచనలను ఆమోదిస్తారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

డబ్బుకు ఇబ్బంది లేకున్నను ఆర్థికంగా అసంతృప్తితో ఉంటారు. వస్త్ర వస్తు వాహనాలు కొనడం, దైవ కార్యాలలో పాల్గొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో గాని, కుటుంబ వ్యవహారాలలో గాని ఇబ్బందులు వచ్చే స్థితి ఉన్నది జాగ్రత్తపడాలి. చిరకాల మిత్రులను కలుసుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపార, వృత్తి రంగాలలో అభివృద్ధికి కొత్త పథకాలు ప్రయత్నాలు ఆచరణలో పెడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. దూరప్రయాణాలుండి ఆత్మీయులను కలుసుకొంటారు. ముఖ్యవిషయాలలో సర్దుకొనిపోతూ అనుకున్న పనులు సాధించుకొంటారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, ఉద్యోగులకు అధికారుల అండదండలు బాగుంటాయి.

# జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో జిల్లా కలెక్టర్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జిల్లాపరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి, నెల్లూరు నగరం, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, విదేశీ పారిశ్రామిక వర్గాలను సైతం ఆకట్టుకునేలా జిల్లాను తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. గత నెల 26న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోట్‌క్లబ్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో చారిత్రక ప్రదేశాలకు, విశిష్టమైన ఆలయాలకు కొదవ లేదని, అదేవిధంగా ఆహ్లాదకరమైన సముద్రతీర ప్రాంతం, అందరినీ ఆకట్టుకునే పులికాట్ సరస్సు వగైరాలున్నాయని, వీటిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయన్నారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో జిల్లా పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం జడ్పీ ఛైర్మెన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు అందరూ కలిసి నెల్లూరు చెరువులో బోట్‌షికార్ చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తొలుత, నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రం నుంచి నెల్లూరు చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ జితేంద్ర, డిఆర్‌ఓ నాగేశ్వరరావు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# జనం కోసం జనవిజ్ఞాన వేదిక

**జెవివి అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు**

జనం కోసం, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని, ఈ కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షులు సూర్యప్రకాష్‌రావు కోరారు. నెల్లూరులోని జెవివి కార్యాలయంలో గత నెల 26న జరిగిన కార్యక్రమంలో ఆయన జెవివి ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. గత 26 సంవత్సరాలుగా జనవిజ్ఞానవేదిక ప్రజల అభ్యున్నతి కోసం, సైన్స్ ప్రగతి కోసం కృషి చేస్తోందన్నారు. జెవివి సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతుందని, సైన్స్ అభిమానులందరూ జెవివిలో చేరాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు బుజ్జయ్య, డాక్టర్ బి. రాజేశ్వరరావు, గౌస్‌బాషా, ఉదయభాస్కర్, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యమే ప్రధానం

**ర్యాలీలో కార్పొరేషన్ కమిషనర్**

పారిశుద్ధ్యం ఎంతో ప్రధానమని, నెల్లూరును పరిశుభ్రంగా వుంచేందుకు అందరూ కృషి చేయాలని, ప్రజల సహకారంతో నగరాన్ని చెత్త, మురికి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ జాన్ శ్యాంసన్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా, నగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గత నెల 26న ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆధ్వర్యంలో రోడ్డను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఎం.ఇ వెంకటట్రావ్, శానిటరీ సూపర్‌వైజర్లు శివనాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

నెల్లూరులోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో గత నెల 26న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, క్యాన్సర్‌వ్యాధిని ముందుగా గుర్తిస్తే, వ్యాధి నివారణకు సరైన చికిత్స అందించవచ్చని, 40 ఏళ్ళు దాటినవారంతా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. మద్యపానం, ధూమపానం, గుట్కా వగైరాలకు దూరంగా వుండాలని, లేదంటే క్యాన్సర్‌వ్యాధి బారిన పడే ప్రమాదం ఎంతైనా వుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాల్యాద్రి, దేవరాల సుబ్రహ్మణ్యం, యం.వి.సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, చలువాది సూర్యనారాయణ, బాలయ్యనాయుడు, పట్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు దొంగల కోసం ప్రత్యేక బృందాలు

జిల్లాలో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎపిటిఎస్ విజిలెన్స్ సిఐ టివి సుబ్బారావు తెలిపారు. గత నెల 25న విద్యుత్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యం సమాచారాన్ని సేకరించేందుకు గోప్యంగా మెసెంజర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని, వారిచ్చే సమాచారాన్ని తనిఖీ బృందాలు పరిశీలించిన అనంతరం విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.



సెప్టెంబర్ 30వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జరిగిన జిల్లా సాగునీటి సలహాకమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర మున్సిపల్‌శాఖా మంత్రి పి.నారాయణ, పక్కన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఇరిగేషన్ ఎస్ఇ కోటేశ్వరరావు.

# నెల్లూరు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ

రిజిస్ట్రేషన్ స్టాంపులశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న నెల్లూరు, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఐ.విజయరాణి | నెల్లూరుజాయింట్1 | కావలి |
| వై.కె.నందకిషోర్ | నెల్లూరుజాయింట్2 | స్టోన్‌హౌస్‌పేట |
| ఎన్.నాగేశ్వరరావు | స్టోన్‌హౌస్‌పేట | కోవూరు |
| కె.శోభ | కోవూరు | వెంకటగిరి |
| యం.ఆంజనేయులు | వెంకటగిరి | రాపూరు |
| యస్.సుకుమార్ | ఆత్మకూరు | నాయుడుపేట |
| యం.కె.శర్మ | నాయుడుపేట | బుచ్చి |
| కె.పద్మావతి | బుచ్చి | సూళ్లూరుపేట |
| ఆర్.రోహిణి | సూళ్లూరుపేట | బుజబుజనెల్లూరు |
| వి.వి.ప్రసాద్‌రెడ్డి | గూడూరు జాయింట్1 | నెల్లూరుజాయింట్ 1 |
| యం.విజయప్రసాదరావు | బుజబుజనెల్లూరు | సత్తెనపల్లి |
| వై.వి.డి.కోటేశ్వరమ్మ | ఆడిట్ యస్.ఆర్ | ముత్తుకూరు |
| ఆర్.సుబ్బారాయుడు | డిఐజి సూపరింటెండెంట్ | గూడూరు జాయింట్1 |
| ఏ.ఇ.ప్రవీణాదేవి | సంతనూతలపాడు | పొదలకూరు |
| పి.సురేష్ | కావలి | డిఐజి-సూపరింటెండెంటు |
| నవకుమార్ | కోట | చీమకుర్తి |
| మహమ్మద్ బాషా | దర్శి | నెల్లూరుజాయింట్2 |

# తీర్థ చిల్డ్రన్స్ హోంలో దసరా సంబరాలు



నెల్లూరునగరం మనుమసిద్ధినగర్‌లోని తీర్థ చిల్డ్రన్స్ హోం స్కూలులో ఇటీవల దసరా సంబరాలు వేడుకగా జరిగాయి. ముందుగా విద్యార్థులు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థులు అఖిల, లిఖిత, సింధు, చరిత, హస్నిక, హారిక, అనిత, భావన, మోహన్‌లు అమ్మవారి నవరాత్రుల వేషధారణలతో, చిత్రలేఖ, దర్శిని నృత్యాలతో, సుజన్, భావన ఉపన్యాసాలతో అందరిని అలరించారు. స్కూలు కరస్పాండెంట్ యం.ద్వారకానాథ్, ప్రిన్సిపల్ యం.సాయికుమారి, స్కూలు ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు దసరా పండుగ ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## కాలధర్మం

# గునపాటి పరంధామరెడ్డి



నెల్లూరు మినిబైపాస్ రోడ్డులోని జి.పి.ఆర్ కళ్యాణ మండపం అధినేత గునపాటి పరంధామరెడ్డి తన 82వ యేట సెప్టెంబర్ 26వ తేదీ కన్నుమూశారు. నెల్లూరు యల్లాయపాళెంలో రైతు కుటుంబంలో జన్మించిన పరంధామరెడ్డి తన పిల్లల చదువుల కోసం నెల్లూరు తరలి వచ్చాడు. 1977 వరకు నెల్లూరు నగర మునిసిఫ్‌గా కూడా ఆయన పనిచేశారు. సమాజంలో వస్తున్న మార్పులతో అధికార యంత్రాంగంలో చోటుచేసుకున్న అలసత్వము అవినీతితత్వము వంటి అంశాలతో రాజీపడలేక 1977లో తన మున్సిఫ్ పదవికి గుడ్‌బై చెప్పి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి తన 82 సంవత్సరాల పరిపూర్ణ జీవితాన్ని సంతృప్తికరంగా సాగించాడు పరంధామరెడ్డి. సెప్టెంబర్26న మాగుంట లే అవుట్‌లోని తన గృహంలో తుదిశ్వాస విడిచిన ఆయనకు భార్య విజయలక్ష్మీ కుమారుడు కృష్ణారెడ్డి, కుమార్తె ఝాన్సీ ఉన్నారు. జిపిఆర్ కృష్ణారెడ్డిగా పరంధామరెడ్డి కుమారుడు నెల్లూరీయులకు సుపరిచితుడే. పరంధామరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్'.

# స్వర్ణభారత్‌లో దసరా సంబరాలు

ఈ నెల 4వ తేదీ ఉదయం 10.30గంటల నుండి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో విజయదశమి సంబరాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సమన్వయకర్త సి.హెచ్.జనార్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత సినీరచయిత సుద్దాల అశోక్‌తేజ విజయదశమి ప్రాశస్త్యం గురించి వివరిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు, రాష్ట్ర విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు, సినీహీరో వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్‌కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా 16సంవత్సరాలలోపు వారికి, 16సంవత్సరాలు పైబడిన వారికి రెండు విభాగాలలో వేషధారణ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుంటాయని పేర్కొన్నారు.

# జయహో 'నమో'

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానిగా 125కోట్ల భారతావని ఆమోదించిన మోడీని ఇక ఆ దేశం ఏ విధంగా తిరస్కరించగలదు. మోడీ ప్రధాని కాగానే అమెరికా పర్యటనకు హడావిడి పడలేదు. భారత్‌తో సారూప్యతగల దేశాలతో సంబంధాలకే ఆయన మొదటి ప్రాధాన్యత నిచ్చారు. భూటాన్, నేపాల్, జపాన్ వంటి దేశాలను పర్యటించాకే, అది కూడా అమెరికా ఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లారు.

భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ఐదురోజుల అమెరికా పర్యటన పూర్తి స్థాయిలో విజయవంతమైంది. ముఖ్యంగా మోడీ తన ప్రసంగాలతో అమెరికన్‌లను, ప్రవాసభారతీయులను ఉత్తేజపరిచిన తీరు అమోఘం. అమెరికా చరిత్రలో ఇంతవరకు ఏ ఇతర దేశాధినేత పర్యటనకు లభించని స్పందన మోడీ పర్యటనకు లభించింది. ఎన్నారైలైతే మోడీ కోసం ఎప్పటి నుండో ఎదురుచూశారు. తనకు వీసా నిరాకరించిన గడ్డపైనే నిలబడి మోడీ భారత కీర్తి పతాకను రెపరెపలాడించారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో పాకిస్థాన్ ప్రధాని లేవనెత్తిన కాశ్మీర్ అంశాన్ని మోడీ తనదైన శైలిలో తిప్పికొట్టారు. వాజ్‌పేయి తర్వాత భారత ప్రతినిధిగా ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించిన ఘనత మోడీదే! ప్రపంచాన్ని ఏ ఒక్క దేశమో ఏ ఒక్క కూటమో శాసించలేదని ఎలుగెత్తిన మోడీ జీ-20 బదులు ఆల్‌జీ ఉండాలని సరికొత్త సందేశమిచ్చారు. ఉగ్రవాదంపై ఆయన తనదైన శైలిలో మాట్లాడి అన్ని దేశాలలోనూ ఆలోచన రేకెత్తింపజేశారు.

ఇక న్యూయార్క్‌లోని మేడిసన్ స్క్వేర్ పార్క్‌లో మోడీ కోసం ఏర్పాటు చేసిన సభ అయితే అభిమానులతో పోటెత్తింది. మోడీ నామస్మరణతో ఆ స్టేడియం మార్మోగింది. ఇక్కడ ఎన్నారైలను ఉద్దేశించి మోడీ చేసిన ప్రసంగానికి సభికులు విరామం లేకుండా చప్పట్లుకొట్టారు. భారత అభివృద్ధికి కలిసిరావాలంటూ ఎన్నారైలకు పిలుపునిచ్చిన మోడీ వారికి శాశ్వత వీసాలు ఇచ్చేలా చట్టాలను మారుస్తున్నట్లు కూడా చెప్పారు. అమెరికాలో ప్రపంచంలోని అన్ని దేశాలవాళ్లున్నారు. కాని ప్రపంచంలోని అన్ని దేశాలలో భారతీయులున్నారు. వారిలో ప్రతిభాపాటవాలున్నాయి. 21వ శతాబ్దం మనదే! మనమెవరికీ తీసిపోము, మీ శక్తియుక్తులే భారత్‌ను ముందుకు నడిపిస్తాయంటూ ఆయన చెప్పిన మాటలతో అందరి మనసులు పులకించాయి.

అమెరికా పర్యటనలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలను, వైద్యనిపుణులను, వివిధ రంగాల నిపుణులను కలిసి మోడీ చర్చలు జరిపారు. అలాగే అమెరికా అధ్యక్షుడు ఒబామా, మోడీల మధ్య జరిగిన చర్చలు ప్రపంచంలోని రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయి. రెండుదేశాలు చేతులు కలిపాయి. మొత్తానికి వీసాను నిరాకరించిన అమెరికాతోనే జైకొట్టించుకుని మోడీ భారత్‌కు తిరిగిరావడం విశేషం.

# జైలుకెళ్ళిన వీరవనిత

(మొదటిపేజీ తరువాయి)

పన్నీరుసెల్వంనే సీఎంగా ఎంపిక చేసింది. ఆరోజు జయకు ఆయన తిరిగి భద్రంగా కుర్చీ అప్పగించారు. ఆ నమ్మకంతోనే రెండోసారి కూడా పన్నీర్‌సెల్వంకే కుర్చీ కట్టబెట్టింది. ఈ విధంగా జయకు జైలు జీవితం పన్నీరుసెల్వం పాలిట అదృష్టంగా మారింది.

1991-96 మధ్య జయలలిత తొలిసారిగా సీఎంగా పనిచేసిన కాలంలో అక్రమ ఆస్తులు కూడబెట్టారంటూ అప్పటి జనతాపార్టీ అధ్యక్షుడు, ప్రస్తుతం బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి కోర్టులో పిటిషన్ వేశారు. అవినీతి నిరోధకశాఖ జయలలిత ఇంటిపై జరిపిన దాడుల్లో 66.65కోట్ల అక్రమ ఆస్తులు, 28కిలోల బంగారం, 830కిలోల వెండి, 10,500 పట్టుచీరలు, 90ఖరీదైన వాచీలు, 750 జతల చెప్పులు బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆమె భూములు కొన్నట్లు డాక్యుమెంట్లు దొరికాయి. వీటిని అక్రమాస్తుల క్రింద జతచేస్తూ 1997లో తమిళనాడు విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ చెన్నైలోని ప్రత్యేకకోర్టులో కేసు దాఖలు చేసింది. అయితే ఆ తర్వాత అన్నాడిఎంకె అధికారంలోకి రావడంతో కేసు విచారణ ఇక్కడ నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేదంటూ డిఎంకె ప్రధాన కార్యదర్శి అన్బళగన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన సుప్రీంకోర్టు జయ కేసు విచారణను బెంగుళూరు కోర్టుకు మార్చింది. దాదాపు 18ఏళ్ల పాటు విచారణ జరిగాక బెంగుళూరు కోర్టు జయను దోషిగా నిర్ధారించి జైలుకు పంపింది.

తమిళులు పురచ్చితలైవిగా ఆరాధించే జయలలిత ఈరోజు జైలుకు పోవడాన్ని ప్రతి రాజకీయనాయకుడు గుణపాఠంగా తీసుకోవాలి. సినీ నటిగా కష్టపడి పైకొచ్చింది. ఎం.జి.రామచంద్రన్ శిష్యురాలిగా రాజకీయారంగేట్రం చేసింది. ఆయన మరణానంతరం ఆయన రాజకీయ వారసత్వాన్ని ఒడిసిపట్టుకుంది. పెళ్లి లేదు, పిల్లలు లేరు, ఎటువంటి బంధుత్వ బాధలు లేవు. నీతిగా ప్రజల కోసమే పని చేసి వుంటే ప్రజాజీవితంలో ఎంతో గొప్పగా రాణించేది. కాని తనకు అవసరం లేని సంపాదనపై ఆశలు పెంచుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడి, కొడుకు కాని దత్తకొడుకు సుధాకరన్ పెళ్లికి వందకోట్లు దుర్వినియోగంచేసి, ఆ అవినీతి పాపాలకు ఈరోజు జైలు పాలయ్యింది.

# వేటు పడింది!

(మొదటిపేజీ తరువాయి)

ప్రసాద్‌గౌడ్, చిట్టమూరు జడ్పీటీసీ దువ్వూరు భారతి, డి.వి.సత్రం జడ్పీటీసీ మువ్వల విజేత ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండో విడతలుగా జరిగిన జడ్పీ ఎన్నికల్లో వైకాపాకు 31జడ్పీటీసీలు, తెలుగుదేశంకు 15జడ్పీటీసీలు వచ్చాయి. జడ్పీ ఫలితాలు వచ్చిన రెండోరోజే అసెంబ్లీ ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో జిల్లా పరిషత్ ఛైర్మెన్ సీటుపై తెలుగుదేశం నాయకుల కన్ను పడింది. వైకాపా జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, తెలుగుదేశం ఛైర్మెన్ అభ్యర్థిగా వేనాటి రామచంద్రారెడ్డిలు రంగంలోకి దిగారు. ప్రభుత్వం తమది కావడంతో తెలుగుదేశం నాయకులు వైకాపా సభ్యులు కొందరికి వల వేశారు. మొదట ఈ వలలో 6మంది పడ్డారు. ఛైర్మెన్ ఎన్నిక కోసం జూలై 6న మొదటి సమావేశం నిర్వహించారు. ఆరోజుకు తెలుగుదేశంకు తగిన బలం లేకపోవడంతో వివాదాన్ని లేవదీసి వాయిదా వేయించారు. అదే నెల 13వ తేదీ రెండోసారి సమావేశం నిర్వహించగా అది కూడా కోరం లేకుండా వాయిదా పడింది. కోరం లేకున్నా మూడో సమావేశంలో మాత్రం ఖచ్చితంగా ఛైర్మెన్ ఎన్నికను నిర్వహించాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించడంతో కలెక్టర్ అదే విషయాన్ని ఇరుపార్టీలకూ చెప్పేసాడు. జూలై 20న మూడో సమావేశం జరిగింది. అప్పటికే కావలి జడ్పీటీసీ పెంచలమ్మను, మనుబోలు జడ్పీటీసీని తెలుగుదేశంవాళ్లు తమ శిబిరంలోకి లాక్కున్నారు. దీంతో ఇరుపార్టీలు 23మంది సభ్యులతో సమంగా నిలిచాయి. దీంతో ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు కలెక్టర్ లాటరీ పద్ధతిని అనుసరించారు. లాటరీలో ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, ఒక కో-ఆప్షన్ పదవులు వైకాపాకు దక్కగా తెలుగుదేశంకు ఒక కో-ఆప్షన్ పదవి మాత్రమే దక్కింది. ఎన్నిక అనంతరం పార్టీ ఫిరాయించిన 8మంది జడ్పీటీసీలపై అనర్హత వేటు వేయాలంటూ వైకాపా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ 8మంది జడ్పీటీసీలకు నోటీసులు జారీ చేశారు. వాళ్లు నివరణ ఇవ్వడానికి కలెక్టర్‌ను మరింత గడువు కోరారు. ఈలోపు వైకాపావాళ్లు అనర్హత వేటు వేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన కోర్టు గత నెల 28వ తేదీ వరకు నిర్ణయం తీసుకోవడానికి కలెక్టర్‌కు గడువిచ్చింది. గడువు తేదీ ముగియనుండడంతో కలెక్టర్ 8మంది జడ్పీటీసీలపై అనర్హత వేటు వేశారు.

# 'మామ్'విజయం వెనుక నెల్లూరు పాత్ర




అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని జాన్ కెన్నడీ ఎయిర్‌పోర్టు. ఎయిర్ ఇండియా విమానం అప్పుడే ల్యాండయ్యింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇంకొంతమంది భారత ప్రతినిధి బృందంతో విమానంలో నుండి దిగారు. అమెరికా అధ్యక్షుడు ఒబామాతో పాటు మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీక్లింటన్, మాజీఅధ్యక్షులు జార్జిబుష్, బిల్‌క్లింటన్‌లు మోడీకి స్వాగతం పలికారు. అక్కడనుండి అందరూ వైట్‌హౌస్‌కు వెళ్లారు. ఒబామా, మోడీలు ఒక గదిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉభయుల కుశల ప్రశ్నలు అయ్యాక ఒబామా ఉన్నట్లుండి మోడీ చేతులు పట్టుకుని ఇవి చేతులుకావు కాళ్లనుకో... మీ ఇస్రోవాళ్లు మార్స్ మీదకు ప్రయోగించిన 'మామ్' ఉపగ్రహాన్ని అంత తక్కువఖర్చుతో ఎలా విజయవంతంగా చేయగలిగారో చెప్పి పుణ్యం కట్టుకోండి, మేమూ అదే బాటను అనుసరిస్తాం, మేం ఒక హాలీవుడ్ సినిమా తీయడానికి పెట్టే ఖర్చుతో మీ ఇస్రోవాళ్లు ఉపగ్రహాలనే పంపించేస్తున్నారు. ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన మాకు కూడా అది సాధ్యం కావడం లేదు. ఆ సీక్రెట్ ఏంటో చెప్పి పుణ్యం కట్టుకోండని బ్రతిమలాడాడు. అందుకు మోడీ ఒప్పుకోలేదు. అది దేవరహస్యం, ఎవరికీ చెప్పకూడదన్నాడు. ప్లీజ్ సార్, మీ ఇస్రో టాలెంట్ ముందు మా 'నాసా' వాళ్ల పరువుపోతుంది. ఈ రహస్యమేంటో మాకు చెప్పండి, మిగిలిన అన్ని విషయాలలోనూ మేము మీకు సహకరిస్తామని ఒబామా అన్నాడు. మోడీ ఇక్కడ కొంచెం కరిగాడు. అయితే సీక్రెట్‌ను లీక్ చేయనని ఒట్టేయండి అంటూ మోడీ చెయ్యి చాపాడు. ఒబామా అలాగే ఒట్టేసాడు. అప్పుడు మోడీ తన వేలితో ఒబామా కళ్ల ముందు స్క్రీన్ గీసి వేలుపెట్టి బటన్ నొక్కినట్లు నొక్కి పిక్చర్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

అది బెంగుళూరులోని ఇస్రో మిషన్ కంట్రోల్ సెంటర్. 334రోజుల సుధీర్ఘ ప్రయాణం తర్వాత 'మామ్' మార్స్ కక్ష్యలోకి కొన్ని నిముషాలలో అడుగుపెట్టబోతుంది. నరేంద్ర మోడీతో పాటు ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్, మాజీఛైర్మెన్ కస్తూరి రంగన్, మాధవన్‌నాయర్, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడులు ఉత్కంఠతగా కంప్యూటర్ స్క్రీన్‌ల మీద ఆ దృశ్యాలను వీక్షిస్తున్నారు. కొన్ని నిముషాలలో మార్స్ కక్షలోకి మామ్ ప్రవేశించింది. అంతే ఒక్కసారిగా అక్కడ చప్పట్లు మార్మోగాయి. మోడీ శాస్త్రవేత్తలందరినీ కౌగిలించుకుని అభినందనలు తెలుపుతూ రాధాకృష్ణన్ వద్దకు వచ్చి... ఈ విజయం అద్భుతం, మన దేశ కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయంగా ఇనుమడింపజేశారు. నూటికి నూరుపాళ్లు ఈ విజయం మీదే అని చెప్పాడు. ఆ మాటకు రాధాకృష్ణన్ తలవంచుకుని... సారీసార్, ఈ విజయం నూరుశాతం మాదే అనడానికి నా మనసు అంగీకరించడం లేదు. ఈ విజయంలో ప్రధానపాత్ర నెల్లూరునగరం నాయకులది కూడా అని చెప్పాడు. ఆ మాటకు మోడీతో పాటు అక్కడేవున్న నెల్లూరీయుడు యం.వెంకయ్యనాయుడు కూడా నోరెళ్లబెట్టాడు. అదెలా అని మోడీ ప్రశ్నించాడు. అప్పుడు రాధాకృష్ణన్ మోడీ కళ్లముందు స్క్రీన్ గీసి వేలితో బటన్ నొక్కాడు. మోడీ కళ్లముందు సన్నివేశాలు మొదలయ్యాయి.

★★★★★

అది శ్రీహరికోటలోని షార్ సెంటర్. ఛైర్మెన్ రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో మిగతా శాస్త్రవేత్తలతో సమావేశమై ఉన్నాడు. మార్స్ మీద ఉపగ్రహాన్ని ప్రయోగించడంపై చర్చ జరుగుతుందక్కడ. మనం అంతరిక్షం వరకు ఉపగ్రహాలు పంపించడానికే నానా అగచాట్లు పడుతున్నాం. అలాంటిది అంగారక గ్రహం దాకా ఉపగ్రహం పోవాలంటే సంవత్సరం పడుతుంది. ఏ ఇంధనం వాడినా ఉపగ్రహం అంత దూరం పోదు. కాబట్టి మనం భూకక్షలో తిరిగే ఉపగ్రహాలనే తయారు చేసుకుందామని అందరూ ముక్తకంఠంతో ప్రతిపాదించారు. కాని రాధాకృష్ణన్‌కు ఎలాగైనా 'మార్స్' మీదకు ప్రయోగం జరపాలనే పట్టుదల ఎక్కువైంది. ఆ రాత్రికి ఆయన షార్‌లో ఉండకుండా నెల్లూరొచ్చాడు. పినాకిని అతిథి గృహంలో దిగాడు. భోంచేసాక అతిథిగృహం మిద్దెపైన మంచం వేసుకుని ఆకాశంలో చుక్కలను లెక్కపెట్టుకుంటూ వీటన్నింటి మీదకు ఉపగ్రహాలు పంపిస్తే ఎంత బాగుంటుందోననుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

వెచ్చటి సూర్యకిరణాలు ఒంటిని తాకడంతో రాధాకృష్ణన్‌కు మెలుకువ వచ్చింది. అప్పటికే తెల్లారింది. రాధాకృష్ణన్ కళ్లు తెరిచాడు. అంతే ఆయనలో భయం, ఆందోళన... కారణం ఆయన పినాకిని గెస్ట్‌హౌస్ మిద్దెమీద లేడు. చుట్టూ చెట్లు చేమలు... అదేదో అటవీప్రాంతంలాగుంది. తాను రాత్రి అక్కడ పడుకుంటే తెల్లారి ఇక్కడ ఎందుకు తేలాడో అర్థం కాలేదు. ఇది దొంగలపనికాదు, భూతాలు, దెయ్యాలవంటి వాటిని తాము నమ్మకూడదు అనుకున్నాడు. అంతలో అటుగా కట్టెలు కొట్టుకు వెళుతున్న ఓ వ్యక్తిని ఆపి... బాబూ ఇది ఏ ఊరు అని అడిగాడు. ఇది అడవి, దగ్గర్లోనే ఆమంచర్ల అనే ఊరుంది అని చెప్పి వెళ్లిపోయాడు. రాధాకృష్ణన్ నడుచుకుంటూ ఆమంచర్ల సెంటర్‌కు వచ్చాడు. అప్పుడే పొదలకూరు వైపు నుండి వచ్చిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సెక్కి నెల్లూరులో దిగాడు. నేరుగా ఏ.సి సెంటర్‌కు చేరుకున్నాడు. అక్కడ తన ఆఫీసులో ఎమ్మెల్యే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి ఒక చేత్తో సిగరెట్ తాగుతూ, ఇంకో చేత్తో వేరుశెనక్కాయలు తింటున్నాడు. రాధాకృష్ణన్‌ను చూడగానే గౌరవంగా లేచి ఆయనను కూర్చోమన్నాడు. ఊరికే రారు మహానుభావులు, ఏంటి ఇలా వచ్చారని వివేకా అడిగాడు. రాధాకృష్ణన్ రాత్రి జరిగిన సంఘటన చెప్పి... ఇది దెయ్యాలపనా, పిశాచాల పనా? ఇంకేదన్నానా? అని అడిగాడు. అది విని వివేకా పగలబడినవ్వాడు. అది చూసి రాధాకృష్ణన్... ఏంటి సార్, నేనింత సీరియస్‌గా అడుగుతుంటే మీరంత సిల్లీగా నవ్వుతారన్నాడు. అందుకు వివేకా... అది దెయ్యాలు, పిశాచాల పని కాదు సార్, మా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల పని... ఆరు బయట పడుకుంటే ఏ మనిషినైనా మంచంతో సహా ఎత్తుకెళతాయి. వాటికి అంత శక్తి వుంది. అంతెందుకు మా డాబా మీద పడుకుంటే రెండుసార్లు నన్ను కూడా హైదరాబాద్‌లో వదిలాయని చెప్పాడు. ఏంటి, ఈ దోమలకు అంత శక్తి వుందా అని రాధాకృష్ణన్ అడిగాడు. అవును సార్, ఇవి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవి. ఈ జాతి దోమలు ఒక్క నెల్లూరులో మాత్రమే మీరు చూడగలరు అని చెప్పాడు. అప్పుడే రాధాకృష్ణన్ మెదడులో ఒక మెరుపు మెరిసింది. 'మార్స్' మీద ఉపగ్రహం ప్రయోగించడానికి ఒక మార్గం దొరికినట్లయ్యింది. వెంటనే ఓ పదికిలోలు దోమలు కావాలని రాధాకృష్ణన్ అడిగాడు. వెంటనే వివేకా మున్సిపల్ అధికారులకు చెప్పి ఐస్‌బాక్సులలో వాటిని అరెంజ్ చేశాడు. రాధాకృష్ణన్ వాటిని తీసుకుని షార్‌కు వెళ్లాడు. శాస్త్రవేత్తలకు భరోసా ఇచ్చి మార్స్ ప్రాజెక్ట్ మొదలు పెట్టించాడు. పిఎస్‌ఎల్‌వి రాకెట్‌లో మామ్ ఉపగ్రహాన్ని అమర్చి, దీనికి జీవఇంధనంగా నెల్లూరు దోమలను నింపి ప్రయోగం జరిపారు. 66కోట్ల మైళ్లదూరంలో వున్న అంగారకుడిపైకి అవి మామ్ ఉపగ్రహాన్ని విజయవంతంగా తీసుకెళ్లాయి. మామ్ సూపర్ సక్సెస్ అయ్యింది.

ఈ సీన్‌లను రాధాకృష్ణన్ మోడీ కళ్లముందుంచాడు. అదంతా చూసి నా నెల్లూరు దోమలు సూపర్ అనుకుంటూ వెంకయ్య మోచేతిమీద వెంట్రుకలు గర్వంతో నిక్కబొడుచుకున్నాయి. మోడీ ఇస్రో బృందంతో పాటు నెల్లూరోళ్లకు కూడా అభినందనలు తెలుపమని వెంకయ్యనాయుడికి చెప్పాడు.

★★★★★

ఇక్కడితో ఒబామా ముందున్న స్క్రీన్ మీద సీన్‌లు అయిపోయాయి. వెంటనే ఒబామా మళ్లీ మోడీ చేతులు పట్టుకుని మాకూ ఓ పదిటన్నుల నెల్లూరుదోమలు కావాలి, ఎలాగైనా ఇప్పించండని బ్రతిమలాడాడు. నెల్లూరు నాయకులతో మాట్లాడి చూస్తానని మోడీ హామీ ఇవ్వడంతో ఒబామా కుదుటపడ్డాడు.

# లోక్‌అదాలత్‌లో 7కేసులు పరిష్కారం

## 7వ అదనపు జిల్లా జడ్జి గురప్ప

గూడూరు కోర్టులో సెప్టెంబర్ 27వ తేదీ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప పాల్గొని మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ఎంతో మంచిదని తెలిపారు. ప్రతినెలా నాల్గవ శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ అదాలత్‌లో ఏళ్ల తరబడి పరిష్కారం కాని వివాదం ఉండి చట్టప్రకారం రాజీ అయ్యే కేసులను పరిష్కరించటానికి అవకాశం ఉందన్నారు. క్రిమినల్, సివిల్, మోటార్ వెహికల్, యాక్సిడెంట్స్, బిఎస్‌ఎన్‌ఎల్ కేసులను లోక్‌అదాలత్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కేసులు పరిష్కారం కావడంతో పాటు సమయం, డబ్బు వృధా కావన్నారు. ఈ మెగా లోక్‌అదాలత్‌లో 5క్రైం, ఒక సివిల్, ఒక ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి ఏడుకొండలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి దివాకర్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సాయిరాం, లోక్‌అదాలత్ సభ్యుడు కోటేశ్వరరావు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# భోగస్ పింఛన్ల తొలగింపు

## ఎంపిడివో నిర్మలాదేవి



పింఛన్లపై చర్చిస్తున్న మండల కమిటీ సభ్యులు

గూడూరు మండలంలోని 23పంచాయితీల పరిధిలో గతంలో ఉన్న 5,315పింఛన్లలో అనర్హులుగా ఉన్న 380మందిని తొలగించి తుదిజాబితాను ఖరారు చేసినట్లుగా ఎంపిడివో నిర్మలాదేవి తెలిపారు. గూడూరు ఎంపిడివో కార్యాలయంలో ఇటీవల మండలస్థాయి కమిటీ సభ్యులైన ఎంపిడివో, జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రెండు బృందాలుగా పంచాయితీ వారీగా ఉన్న జాబితాపై ఆరాతీశారు. దీనిపై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు. అయితే కొన్ని పంచాయతీలలో నేరుగా లబ్ధిదారుని వద్దకు వెళ్లలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. తర్జనభర్జన మధ్యనే తుదిజాబితాను ఖరారు చేశారు. అదేవిధంగా మండలంలో కొత్తగా వివిధరకాల పింఛన్ల కోసం 873మంది దరఖాస్తు చేసుకున్నారని, వీటన్నింటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపీపీ పిట్టి రావమ్మ అధ్యక్షతన జరగాల్సిన తుదిజాబితా ఆమె లేకుండానే పూర్తి చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా చేపట్టాలి

## - తహశీల్దార్ వెంకటనారాయణమ్మ



బిఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

ఓటర్ల జాబితా సవరణలను బీఎల్‌ఓలు సక్రమంగా చేపట్టాలని గూడూరు తహశీల్దార్ వెంకట నారాయణమ్మ సూచించారు. గత నెల 27న తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటర్లజాబితా సవరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 10వతేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల జాబితాలను పరిశీలించాలన్నారు. జాబితాలో తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే మార్పులు, చేర్పులకు మీసేవా ద్వారా సరిచేసుకునే అవకాశాన్ని ఓటర్లకు తెలియజేయాలని కోరారు. 18సంవత్సరాలు నిండి, కొత్తగా ఓటర్లుగా చేరేవారు తమ దరఖాస్తులను ఇంటింటికి సర్వేకు వచ్చే బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు.

# గౌతమి మృతి

గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గౌతమి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఆసుపత్రిలో మృతిచెందినట్లు సహచర విద్యార్థులు తెలిపారు.

చిత్తూరుజిల్లా వెదురుకుప్పం మండలం జక్కదనం గ్రామానికి చెందిన గౌతమి బోన్‌మ్యారో ఫెయిల్యూర్ సిండ్రోమ్ వ్యాధికి గురైంది. ఆమెకు నయమయ్యేందుకు రూ.16లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. అంతమొత్తం ఖర్చుపెట్టే స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో గౌతమి స్నేహితులు స్పందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విరాళాలుగా రూ.10.50లక్షలు సేకరించారు. గౌతమిని రాయవేలూరులోని సీఎంసీ ఆసుపత్రిలో చేర్పించారు. మిగిలిన మొత్తాన్ని కూడా సేకరించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీ ఆమెకు శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. ఇంతలో పరిస్థితి విషమించడంతో గౌతమి మృతిచెందింది. దీంతో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# ప్రమాదకరంగా లారీలు

గూడూరు సమీపంలో చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిపై భారీ వాహనాలు నడిరోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోటుపాళెం కూడలి వద్ద గూడూరు నుంచి నాయుడుపేటకు వెళ్లే మార్గంలో, అదే విధంగా నాయుడుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో సర్వీసురోడ్డులోనే గత నెల 27వతేదీ భారీగా లారీలు, ఆటోలు నిలిపివేయడంతో పలువురు ద్విచక్రవాహనదారులకు తృటిలో ప్రమాదం తప్పినట్లైంది. కార్లు, లారీల డ్రైవర్లు వేగంతో వెళ్తుండటం, అదేక్రమంలో కూడలి ప్రాంతంలో మలుపు వద్ద నిలిపివేసి డాబాలకు వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొంది. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

# అమ్మవార్లకు విశిష్ట పూజలు

గూడూరులో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు విశిష్టపూజలు నిర్వహించారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలో విజయదుర్గాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించి అంకురార్పణ, దీక్షాకంకణం కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు కౌన్సిల్



# మేయర్‌పై ప్రశ్నల దాడి.. సమావేశంలో వాడివేడి


పాలకవర్గం ఏర్పడిన మూడునెలల తర్వాత నెల్లూరు నగరపాలక సంస్థ తొలి కౌన్సిల్ సమావేశం సోమవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో జరిగింది. ఉదయం 11గంటలకు మొదలై సాయంత్రం 6గంటల దాకా జరిగిన ఈ సమావేశంలో అధికార, విపక్ష సభ్యులందరూ కలిసి మేయర్ అబ్దుల్ అజీజ్‌కు సినిమా చూపించారు. తమ విమర్శలతో ఆయన చేత అరగంట కొకసారి నీళ్లు తాగించారు. మేయర్ పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకుని, దాని కోసం ఎంతో ఖర్చు చేసి ఆ కుర్చీనెక్కిన అజీజ్‌కు తొలి సమావేశంలోనే భవిష్యత్ చిత్రం క్లియర్‌గా కనిపించింది. ముఖ్యంగా మేయర్‌గా గెలిచిన వెంటనే పార్టీ మారడం కూడా ఇక్కడ ఆయనకు శాపంగా మారింది. ఎందుకంటే పార్టీ మారాడని చెప్పి ఆయనను మేయర్‌గా ఎన్నుకున్న వైయస్సార్ కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆయనకు శత్రువులయ్యారు. తమ అనుమతి లేకుండానే అజీజ్ తెలుగుదేశంలోకి రావడంతో ఆ పార్టీ సభ్యులు కూడా సమావేశంలో ప్రతిపక్షంగానే వ్యవహరించారు. దీంతో మేయర్ తనను గెలిపించిన పార్టీ తోడు లేక, తాను చేరిన పార్టీ వాళ్లు అండగా నిలవక ఒంటరిగా మిగిలాడు.

సమావేశం ప్రారంభంలోనే ఇటీవల మృతి చెందిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితో పాటు పలువురికి సంతాపం ప్రకటించారు. అనంతరం మేయర్ అజెండాను చదువుకుంటూ పోసాగాడు. కొద్దిసేపటి తర్వాత వైకాపా ఫ్లోర్‌లీడర్ పి.రూప్ కుమార్‌యాదవ్ లేచి... ఇదేమీ క్లాసు కాదు, మీరు అయ్యోరు, మేము పిల్లలం కాదు, మీరు చదువుతుంటే మేం వినడానికి... అసలు దీనిని అజెండా అంటారా? అంటూ నిలదీశారు. దీనిని అజెండా అంటే తన పదవికి రాజీనామా చేస్తానంటూ తెలుగుదేశం కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ ఆయనకు మద్దతు పలికారు. అధికార, విపక్ష సభ్యులనే తేడా లేకుండా అందరు కార్పొరేటర్లు తమ డివిజన్‌లలోని సమస్యలు, కార్పొరేషన్‌లో నెలకొన్న అవినీతి వంటి అంశాలపై ఉతికి ఆరేశారు. 8వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ జడ్.శివప్రసాద్ అందరు సభ్యులతో చర్చించి అజెండా రూపొందించి ఉండాల్సిందన్నారు. కార్పొరేషన్‌లో నెలకొన్న అవినీతి, నగరంలో వున్న సమస్యలపై అందరూ సమన్వయంతో పనిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో తమ డివిజన్‌లలోని సమస్యలపై అందరు కార్పొరేటర్లు మాట్లాడారు. మేయర్‌గా అజీజ్‌కు ఇది తొలి సమావేశం కావడం, సమావేశం నిర్వహణలో అనుభవం లేకపోవడంతో తడబాటు తప్పలేదు.

**శెభాష్ మయూర్:** కౌన్సిల్‌లో కాంగ్రెస్ తరపున వున్న ఏకైక కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి. తొలి సమావేశంలోనే నాయకత్వ లక్షణాన్ని చాటుకున్నాడు. చాలా సమయస్ఫూర్తిగా మాట్లాడారు. హుందాగా వ్యవహరించారు. తొలి సమావేశంలోనే ఆయన మాట్లాడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. కౌన్సిల్‌లో అతను వ్యవహరించిన తీరుకు విపక్షసభ్యులు సైతం ఆయనను అభినందించారు.

# బెజవాడ గోపాలరెడ్డి అవార్డు సభకు రోశయ్య




డా॥బెజవాడ గోపాల్‌రెడ్డి అవార్డు ప్రధానోత్సవ సభకు ముఖ్య అతిథిగా తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. సెప్టెంబర్ 21న జరగవలసిన ఈ కార్యక్రమం ఈ నెలకు వాయిదాపడింది. త్వరలో జరగనున్న ఈ కార్యక్రమంలో రోశయ్యతో పాటు రాజ్యసభసభ్యులు డా॥తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, ఐ.వర ప్రసాద్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని 2014 సంవత్సరానికిగాను అవార్డుని సినీనటుడు మోహన్‌బాబుకి ఇవ్వనున్నారు. పైన పేర్కొన అతిథులందరూ బెజవాడ గోపాల్‌రెడ్డి అవార్డు అందుకున్న వారే కావడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకత కాబోతుంది. బహుశా ఈ నెల 21నే ఈ కార్యక్రమం ఉండ వచ్చని అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి.నరసింహం 'లాయర్'కి తెలిపారు.

# జన్మభూమి నెల్లూరు ఇన్‌ఛార్జ్‌గా అనంతరాము



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానసపుత్రిక కార్యక్రమం 'జన్మభూమి'. 1996-2004 మధ్యకాలంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ కార్యక్రమానికి ఇచ్చినంత ప్రాధాన్యత మరే ఇతర కార్యక్రమానికీ ఇవ్వ లేదు. ఇప్పుడు కూడా మళ్ళీ జన్మభూమికి శ్రీకారం చుట్టబోతున్నారు. అక్టోబర్ 2 నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి కార్యక్రమం జరగబోతుంది. జన్మభూమి కార్యక్రమం అమలుకు అన్ని జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారు లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. నెల్లూరుజిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి అనంతరామును ఇన్‌ఛార్జ్‌గా ప్రభుత్వం నియమించింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే అనంతరాము ఈ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన 'నీరు-మీరు' కార్యక్రమాన్ని ఆనాడు విజయవంతం చేశారు. జన్మభూమి కార్యక్రమాలలో ఎంతో అనుభవముంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో జన్మభూమి బాధ్యతలు ఆయనకు అప్పగించారు.



# 17న వికలాంగులకు వైద్యశిబిరం





వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో "ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా" సహకారంతో అక్టోబర్ 17వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గం టల వరకు నెల్లూరు టౌన్‌హాలులో వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేసేందుకు పరీక్షలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షులు ఏ.వి.యస్.కృష్ణమోహన్, కార్యదర్శి ఇ.సురేష్‌కుమార్, కోశాధికారి టి.సహజానందరెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో వారు మాట్లాడుతూ అర్హులైన వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌ఛైర్స్ వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు ఎనిమిది వారాలలోపు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో పాల్గొను వికలాంగులు వారి చిరునామా ధృవపత్రం, వ్యక్తిగత ధృవపత్రం (ఓటర్ కార్డు లేదా రేషన్ కార్డు లేదా ఆధార్‌కార్డు), ఆదాయ ధృవీకరణ పత్రం, అంగవైకల్య ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో తప్పనిసరిగా తీసుకుని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈమేరకు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

# పనబాక జంటకు పిహెచ్‌డిలు



మాజీకేంద్రమంత్రి పనబాక లక్ష్మి, ఆమె భర్త, రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి పనబాక కృష్ణయ్యలు పిహెచ్‌డిలు సాధించారు. 'చేనేత సమాజంలో మహిళల స్థితి' అన్న అంశంపై పనబాక లక్ష్మి చేసిన పరిశోధనలకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఏపిలో స్వయంసహాయక గ్రూపులపై అధ్యయనం - మహిళా సాధికారత సాధనలో చిక్కులు' అన్న అంశంపై పనబాక కృష్ణయ్య చేసిన పరిశోధనలకు గాను ఔరంగాబాద్(మహారాష్ట్ర)లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మరఠ్వాడా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. లేటు వయసులో ఘాటుగా శ్రమించి డాక్టర్స్ అనిపించుకున్న పనబాక దంపతులకు 'లాయర్' అభినందనలు.



Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com